

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ



నందన్ ఎలక్ట్రానిక్స్
సెల్ నెం. 9949010118
డీలర్స్ ఇన్ : సెక్యూరిటీ సిస్టం, సీసీ కెమెరాస్, బయోమెట్రిక్ అండ్ ఫైర్ సేఫ్టీ


Opp. Water Tank, Durga Nagar Junction, Mailrdevpally, Hyderabad-05



| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 174 | ది. 13-9-2025 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 174 | Date : 13-9-2025 | Saturday | Pages : 8 | Rs.1/- |


# భావితరాల కోసమే విజన్

- శరీరానికి పోషకాల లాగే సమాజానికి మంచి పాలసీలు అవసరం
- ప్రధాని మోదీ నేతృత్వంలో భారత్ అభివృద్ధి అన్‌స్టాపబుల్
- వచ్చే మూడేళ్లలో అమరావతి ఇన్‌ఫ్రా - 2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి
- సాగునీటితో రాయలసీమలో కోస్తాను మించిన అభివృద్ధి
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు - ఏమాత్రం నష్టం లేదు
- టెక్నాలజీతో ఇంటెన్సివ్ కేర్ కాదు.. ఇంటిదగ్గరే హెల్త్ కేర్
- అమరావతిలో నిర్వహించిన వే 2 న్యూస్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



**అమరావతి,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇది తన బాధ్యత అని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్-2047 అమలు చేస్తుంటే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నామని వెల్లడించారు. శరీరానికి పోషకాలు ఎంత అవసరమో సమాజానికి మంచి పాలసీల అవసరం అంతే ఉందని సీఎం అన్నారు. వచ్చే 22 ఏళ్లలో మన రాష్ట్రం ఎక్కడ ఉండాలన్న అంశాన్ని నిర్దేశించేందుకే విజన్ రూపొందించి అమలు చేస్తున్నట్టు వివరించారు. అమరావతిలో శుక్రవారం వే 2 న్యూస్ కాంక్లేవ్‌కు హాజరైన ముఖ్యమంత్రి వేర్వేరు అంశాలపై అభిప్రాయాలను వ్యక్తీకరించారు. వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ ఎలా ఉండబోతోందన్న అంశాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..."రాష్ట్రంలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం. 25 ఏళ్ల క్రితం భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా మారింది. 2038 నాటికి భారత దేశం నెంబర్-1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నాను. ఈ ఏడాది..గతేడాది డబుల్ డిజిట్ గ్రోత్ సాధించగలిగాం. 2028-29 నాటికి రూ. 29,29,402 కోట్ల మేర జీఎస్డీపీ సాధించగలం. 2029-2034 నాటికి రూ. 57,21,610 కోట్ల జీఎస్డీపీ సాధించేలా ప్రణాళికలు రూపొందించాం. దీన్ని సాధించే బాధ్యత ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది. 2028-29 నాటికి తలసరి ఆదాయాన్ని రూ.5,42,985 సాధిస్తాం. 2029-2034 నాటికి తలసరి ఆదాయం రూ.10.55 లక్షల కోట్లు సాధించగలం. ఇదేమీ అసాధ్యం కాదు...నిర్దిష్టమైన ఆలోచనతోనే ప్రణాళికలు వేశాం. దీనికి సంకల్పంతో పాటు మెగా డ్రీమ్స్ ఉండాలి. విజన్ 2020 సాకారం అయ్యాక కూడా విజన్ డాక్యుమెంట్లపై ఇంకా అనుమానాలు సరికాదు. భారత్ లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాతరంగా అమలు చేయాలి.


**సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం చేస్తున్నాం...** అభివృద్ధికి అదే తరహాలో నిధులిస్తున్నాం. రాజకీయాలు అవసరమే కానీ...సమాజం గురించే ఆలోచించాలి. రాజకీయాలే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి జరిగేది కాదు.. విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలి. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నాను. ఇప్పుడు సంపద సృష్టిస్తున్నాం..పేదలకు అందిస్తున్నాం. ప్రజలందరికీ ప్రయోజనం కలిగేలా మంచి పబ్లిక్ పాలసీలు తీసుకువచ్చాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**మూడేళ్లలో అమరావతి ఇన్‌ఫ్రా పనులు-2027 డిసెంబర్‌కు పోలవరం పూర్తి..** ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశ అభివృద్ధి అన్ స్టాపబుల్ అని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో సంక్షోభాలు వస్తున్నాయని.. నేపాల్, బంగ్లాదేశ్, ఫ్రాన్స్ ఇలా చాలా దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు చూస్తున్నామని సీఎం వ్యాఖ్యానించారు. సుస్థిరతకు, నాయకత్వానికి మారుపేరు భారతదేశమేనని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా సంస్కరణలు ప్రారంభించి అన్ని ప్రాంతాలకు అభివృద్ధిని వికేంద్రీకరించామని అన్నారు. దీనిపై మాట్లాడుతూ.. "విశాఖ, అమరావతి, విజయవాడ, తిరుపతి వంటి నగరాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. సేవల రంగం ద్వారా ఎక్కువ గ్రోత్ సాధించేలా చర్యలు చేపడుతున్నాం. అమరావతిలో ప్రారంభించిన ప్రతి పని రాబోయే మూడేళ్లల్లో పూర్తి అవుతుంది. రూ.50 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు పూర్తి అవుతాయి. ప్రధాని చేతుల మీదుగా ఇవి ప్రారంభం అవుతాయి. 2019లో గెలిచి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి అయ్యేది. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతింది.

# నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే..

- నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎంను కలిశా
- నేను కప్పుకొన్నది కాంగ్రెస్ పార్టీ కండువా కాదు..
- జాతీయ జెండాలోని 3 రంగులతో కూడిన కండువా
- స్పీకర్‌కు వేర్వేరుగా వివరణ ఇచ్చిన 8 మంది ఎమ్మెల్యేలు
- మరింత సమయం కావాలంటూ మిగతా ఇద్దరి విజ్ఞప్తి
- వివరణల ఆధారంగా బీఆర్ఎసకు నోటీసులిచ్చిన స్పీకర్!
- విచారణకు హాజరై వాదనలు వినిపించాలని సూచన





**హైదరాబాద్,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** "నేను పార్టీ మారలేదు! ఇప్పటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే సభలో కొనసాగుతున్నాను. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలిసినట్లుగానే.. నేనూ నా నియోజకవర్గ అభివృద్ధి పనులపైనే రేవంత్‌రెడ్డిని కలిశాను. నేను కలిసినప్పుడు.. సీఎం రేవంత్ నా మెడలో వేసింది కాంగ్రెస్ కండువా కాదు. జాతీయ జెండాలోని మూడు రంగులతో కూడిన కండువా!" - బీఆర్ఎస్ ఇచ్చిన అనర్హత పిటిషన్‌కు సంబంధించి స్పీకర్ ప్రసాద్‌కుమార్ నుంచి నోటీసులు అందుకున్న ఎమ్మెల్యేలు.. కాస్త అటు, ఇటుగా ఇచ్చిన వివరణ ఇది. స్పీకర్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు నోటీసులు అందుకోగా, వారిలో 8 మంది ఎమ్మెల్యేలు రాతపూర్వకంగా వివరణ ఇచ్చారు. మిగిలిన ఇద్దరూ వివరణ ఇచ్చేందుకు మరి కొంత గడువు కావాలని స్పీకర్‌ను కోరినట్లు తెలుస్తోంది. వివరణ ఇచ్చిన ఎమ్మెల్యేల్లో తెల్లం వెంకట్రావు, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, పోచారం శ్రీనివాసరెడ్డి, ప్రకాశ్‌గౌడ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సహా మరో ఇద్దరు ఉన్నారు. వివరణ ఇచ్చిన వారందరూ.. తాము పార్టీ మారలేదని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే కొనసాగుతున్నామని స్పష్టం చేశారు. దానికి సంబంధించిన కొన్ని ఫొటోలు, ఆధారాలను సమర్పించారు. శాసన సభలో బీఆర్ఎస్ సభ్యులు 38 మంది ఉన్నారంటూ అనేక సందర్భాల్లో కేటీఆర్, హరీశ్‌రావు చెప్పారని, తద్వారా తమను బీఆర్ఎస్ సభ్యులుగానే వారు పేర్కొన్నారని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి పనులపైన అధికార, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు సీఎంను కలవడం దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయమేనని, తాము కూడా అభివృద్ధి పనులపైనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశామని వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు వచ్చే వేతనంలో నెలకు రూ.5 వేలు.. పార్టీ ఫండ్ కింద కట్ అవుతాయని, ఈ ఏడాది మార్చి వరకూ తమ వేతనం నుంచి పార్టీ ఫండ్‌ను తీసుకున్నారంటూ సంబంధిత ఆధారాలను సమర్పించారు. అసెంబ్లీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ(పీఏసీ) ఛైర్మన్ పదవిని ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వడం సంప్రదాయమని, అందువల్లే తనకు పీఏసీ ఛైర్మన్ పదవి ఇచ్చారని అరికెపూడి వివరణ ఇచ్చినట్లు సమాచారం. తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీఆర్ఎస్ నేతలు గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి హాజరయ్యారని స్పీకర్ దృష్టికి తెచ్చినట్లు తెలుస్తోంది. అయితే, 8 మంది ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణ ఆధారంగా బీఆర్ఎసకు స్పీకర్ కార్యాలయం నోటీసులు పంపినట్లు సమాచారం. బీఆర్ఎసలోనే కొనసాగుతున్నామంటూ ఆయా ఎమ్మెల్యేలు వివరణ ఇచ్చారని, ఆధారాలూ సమర్పించారని పేర్కొంటూ.. విచారణకు పిలిచినప్పుడు హాజరై వాదనలు వినిపించాలని బీఆర్ఎసకు సూచించినట్లు సమాచారం. కాగా, అనర్హత అంశంపై ఒక్కో ఎమ్మెల్యేను స్పీకర్ ప్రసాద్ కుమార్ స్వయంగా విచారించనున్నారు. ఆ విచారణకు పిటిషన్‌ను దాఖలు చేసిన బీఆర్ఎస్ ప్రతినిధి, ఫిరాయింపు ఆరోపణ ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే.. తమ న్యాయవాదులతో హాజరు కావాల్సి ఉంటుంది. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత.. తగిన సమయంలో స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని అసెంబ్లీ వర్గాలు తెలాపాయి.

# చూసి రమ్మంటే.. తీసుకొచ్చాడు.. శభాష్



**అమరావతి,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** సీఎం చంద్రబాబు అంటే.. పనిరాక్షసుడనే పేరు తెచ్చుకున్నారు. సరే.. ఆయన సంగతి పక్కన పెడితే.. ఆయన దగ్గర ప్రశంసలు దక్కాలంటే.. మాటలు కాదని అంటారు నాయకుల నుంచి అధికారుల వరకు కూడా. దీనికి కారణం.. అంత టఫ్ వర్క్‌ను ఆయన అప్పగించడమే కాదు, అంతే నిశితంగా కూడా గమనిస్తారు. ఎంతో కృషి చేస్తే తప్ప.. చంద్రబాబు దగ్గర మార్కులు సంపాయించుకోవడం అంత ఈజీ కాదు. తాజాగా ఆఘనతను సాధించారు .మంత్రి నారా లోకేష్. ఆయనకు తాజాగా అప్పగించిన పనిలో సక్సెస్ అయ్యారు.నేపాల్‌లో నెలకొన్న అల్లర్లు, ఆందోళనల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలుగు వారికి భరోసా నింపడంతో పాటు.. వారిని సురక్షితంగా తీసుకువచ్చే బాధ్యతను సీఎం చంద్రబాబు మంత్రి నారా లోకేష్‌కు అప్పగించారు. దీంతో రంగంలోకి దిగిన నారా లోకేష్ .. కేంద్రంలోని పెద్దలతో టచ్‌లో ఉండి.. నిరంతరం సమీక్షించారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిని కూడా ప్రతి రెండు గంటలకు ఒకసారి సంప్రదించారు. వీడియో కాల్స్ చేశారు. యోగ క్షేమాలు తెలుసుకున్నారు., ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ఇండిగో, ఎయిర్ ఇండియా విమానాలను ఏర్పాటు చేసింది. ఇక, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒక విమానాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసి.. ఢిల్లీ నుంచి విశాఖకు.. ఇక్కడ నుంచి తిరుపతి, కడప జిల్లాలకు నడిపింది. తాజాగా 145 మంది ఒక్క ఏపీకి చెందిన వారే.. విశాఖకు చేరుకున్నారు. వారిలో 105 మంది ఒక్క ఉత్తరాంధ్ర జిల్లాలకు(విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం) చెందిన వారు ఉన్నారు. మిగిలిన వారిలో చిత్తూరు, కడప జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. వీరిని అదే విమానంలో కడపకు తరలించారు. కాగా.. విమానాశ్రయానికి చేరుకున్న వారిని(గురువారం రాత్రి 7 గంటల సమయంలో) ప్రత్యేక కార్లు, బస్సుల్లో వారి వారి ఇళ్లకు చేర్చారు. వారికి విమానాశ్రయంలో తాగునీరు, ఆహారం అందించారు. సో.. మొత్తంగా.. నేపాల్ ఘటనలో చిక్కుకున్న తెలుగువారిని సురక్షితంగా ఏపీకి తీసుకువచ్చే విషయంలో మంత్రి నారా లోకేష్ చూపిన చొరవ, ఉత్సాహం.. అప్పగించిన పనిని అర్జునుడిగా పూర్తి చేసిన విధంగా వంటివి చంద్రబాబుకు మంత్ర ముగ్ధుడిని చేశాయి. దీంతో ఆయన సంతోషం వ్యక్తం చేశారు. "చూసి రమ్మంటే.. తీసుకొచ్చాడు.. శభాష్" అంటూ మంత్రి నారా లోకేష్‌ను అభినందించారు. అదేవిధంగా ఆయనకు సహాయకారులుగా ఉన్న మంత్రులు అనిత, దుర్గేష్‌లను కూడా చంద్రబాబు ప్రశంసించారు. మొత్తంగా నేపాల్లో చిక్కుకున్న తెలుగు వారు 90 శాతం మంది చేరుకున్నట్టేనని అధికారులు తెలిపారు.

# రూ.1000 కోట్ల మోసం..



**హైదరాబాద్,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** ఇద్దరు నిందితుల అరెస్టు వ్యవస్థీకృత ఆర్థిక నేరాల నెట్‌వర్క్‌ను సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బ్రేక్ చేశారు. కృత్రిమ మేధ ఆధారిత పెట్టుబడుల పేరిట సుమారు రూ.1,000 కోట్లు మోసం చేసిన ఇద్దరు ఘరానా కేటుగాళ్లను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లాకు చెందిన గడ్డం వేణుగోపాల్, కర్ణాటకకు చెందిన శ్రేయాస్ పాల్ ఇరువురు కలిసి సైబరాబాద్ కేంద్రంగా నకిలీ కంపెనీలను ఏర్పాటు చేశారు. ఐఐటీ క్యాపిటల్ టెక్నాలజీస్, ఏవీ సొల్యూషన్స్, శ్రీనివాస్ అనలిటిక్స్, ట్రేడ్ బుల్స్ టెక్నాలజీస్ వంటి రకరకాల పేర్లతో ఆన్‌లైన్‌లో నకిలీ కంపెనీలను నిర్వహిస్తున్నారు. పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు నకిలీ సెబీ, ఎన్ఎస్ఈ, బీఎస్ఈ రిజిస్ట్రేషన్లను సైతం సృష్టించారు. మధ్యతరగతి ఇన్వెస్టర్లను, ఐటీ నిపుణులు, రిటైర్డు ఉద్యోగులను నమ్మించేందుకు ప్రీమియం ఆఫీసులు, హోటళ్లలో సెమినార్లలో నిర్వహించేవారు. పెట్టుబడులపై ఏటా 84 శాతం రాబడిని అందిస్తామని మాయమాటలు చెప్పారు. స్టాక్ మార్కెట్ ప్రిడిక్షన్ సాఫ్ట్‌వేర్, కల్పిత ట్రేడింగ్ డాష్‌బోర్డ్‌ల ముసుగులో 2022 నుంచి 2025 మధ్య కాలంలో సుమారు 3 వేలకు పైగా బాధితుల నుంచి రూ.వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులను వసూలు చేశారు. ఇన్వెస్టర్ల నుంచి వసూళ్లు చేసిన సొమ్మును 21 వేర్వేరు బ్యాంక్ ఖాతాలకు మళ్లించారు. ఆయా సొమ్ముతో ప్రాపర్టీలు, లగ్జరీ వాహనాలు, బంగారం కొనుగోలు చేశారు. ఈమేరకు పలువురు బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఇద్దరు నిందితులు గడ్డం వేణుగోపాల్, శ్రేయాస్ పాల్‌లను అరెస్టు చేశారు. 20 మందికి పైగా ఏజెంట్లు, కన్సల్టెంట్లు, టెక్నికల్ డెవలపర్లు, వెబ్‌సైట్ నిర్వాహకులు ఈ నెట్‌వర్క్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# నేతన్నలకు ఆప్కో బకాయిల చెల్లింపు

- మొదటి విడతగా రూ.2 కోట్లపై పైగా చెల్లింపులు
- 7 డివిజన్లలో 84 సొసైటీల బ్యాంకు ఖాతాల్లో బకాయిల జమ
- మంత్రి సవిత ఆదేశాలతో బకాయిల చెల్లింపు
- త్వరలో మిగిలిన బకాయిలూ చెల్లిస్తాం : మంత్రి సవిత



**అమరావతి,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేతన్నలకు మేలు చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటూ వస్తోంది. తాజాగా చేనేతలకు మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఆప్కో ద్వారా నేతన్నలకు పడిన బకాయిల్లో 20 శాతం మేర చెల్లించాలని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. ఈ మేరకు రూ.2,00,32,615.41లను ఆప్కో అధికారులు శుక్రవారం విడుదల చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేత పరిశ్రమ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చింది. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలు పెంచేలా జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చేనేత బజార్లు నిర్వహిస్తోంది. టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తోనూ ఒప్పందం చేసుకుంది. 93 వేల చేనేత కుటుంబాలుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 11,488 మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేస్తోంది. 50 ఏళ్లు నిండిన 92,724 మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున పెన్షన్ అందజేస్తోంది. నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తోంది. ఆప్కోకు వస్త్రాలు విక్రయించే నేతన్నలకు అయిదు శాతం జీఎస్టీ మినహాయిస్తోంది. ప్రస్తుత ట్రెండ్ కు అనుగుణంగా రెడీమేడ్ దుస్తుల తయారీలో శిక్షణిస్తూ, ఉత్పత్తులను ఆప్కో, ఈ కామర్స్ ద్వారా విక్రయాలు చేస్తోంది. కేవలం 15 నెలల కాలంలో నేతన్నలకు ఆర్థిక భరోసా కలిగించేలా, గౌరవప్రదమైన జీవనం సాగించేలా కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది.

**రూ.2 కోట్లకుపైగా బకాయిల చెల్లింపు..** రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి, నేతన్నల సంక్షేమానికి కార్యక్రమాలు చేపడుతూనే, ఆప్కో ద్వారా బకాయిలు కూడా చెల్లించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 84 చేనేత సొసైటీల నుంచి ఆప్కో వస్త్రాలను కొనుగోలు చేస్తుంటుంది. నేతన్నల నుంచి కొనుగోలు చేసే వస్త్రాలను ఆప్కో షోరూమ్ లు, ఈ కామర్స్ ద్వారా విక్రయాలు చేస్తోంది. నేతన్నల నుంచి కొనుగోలు చేసిన వస్త్రాలకు సంబంధించి బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత ఆదేశాలు జారీచేశారు. తక్షణమే ఆప్కో ద్వారా నేతన్నలకు పడిన బకాయిలను చెల్లించాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు.

# గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం


- సమ్మక్క, సారలమ్మ ఆలయ ఆధునీకరణ
- మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, లక్ష్మణ్ కుమార్



**హైదరాబాద్,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** ఆసియా ఖండములో అత్యంత ప్రసిద్ధిగాంచిన సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని గిరిజన సంస్కృతి సంప్రదాయాలు వారి మనోభావాలకు అనుగుణంగా ఆధునీకరణను చేపడుతున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఆధునీకరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎస్.సి. అభివృద్ధి మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్ తో కలిసి మంత్రి సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధునీకరణ పనులకు తుది ఆమోదం తెలిపిన తరువాత తక్షణమే పనులు ప్రారంభించి వంద రోజుల్లో పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు మంత్రులు సూచించారు. భక్తులకు మరింత సౌకర్యవంతముగా ఉండేలా చేపట్టే ఆధునీకరణ పనుల్లో గిరిజనుల సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని, ఈ విషయములో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మేడారం ఆలయాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారని, వచ్చే వారంలో ముఖ్యమంత్రి స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నందున తగు ప్రణాళికలు, సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిని బతికించుకోవాలి

- ఆలోచించి మార్గం కనిపెట్టండి అండగా ఉంటాం
- సింగరేణి కార్మిక సంఘం నాయకులతో
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** సింగరేణిని బతికించుకోకపోతే భవిష్యత్తు తరాలకు ఏమి ఇవ్వలేం.. సింగరేణిని పది కాలాలపాటు కాపాడుకునేందుకు ఏం చేయాలో కార్మిక సంఘాలు ఆలోచించి మార్గం కనిపెట్టండి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో సింగరేణి కార్మిక సంఘాలతో డిప్యూటీ సీఎం సమావేశం అయ్యారు. సింగరేణి సంస్థలో పనిచేసే వారు సంస్థ గురించి విధానపారమైన నిర్ణయాలు తీసుకోకపోతే నష్టం జరుగుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు. మారిన ప్రపంచ ఆర్థిక పరిస్థితుల్లో ఎక్కడ తక్కువ ధరకు బొగ్గు లభిస్తే అక్కడ కొనుక్కునే అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు అమ్మకం కాకపోతే మిగిలిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. అన్ని సంఘాలు సమావేశమై సింగరేణి భవిష్యత్తు గురించి నిర్ణయాలు తీసుకోవాలి, వాటిని అమలు చేసేందుకు సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వాలు వస్తుంటాయి పోతుంటాయి సంస్థను బతికించుకునేందుకు ఉన్న అన్ని మార్గాలు అన్వేషించాలని కార్మిక సంఘాలకు సూచించారు. కార్మిక సంఘాలు అవగాహన లేకుండా హిస్టారికను మాట్లాడితే సంస్థపు నష్టం జరుగుతుంది. మారిన ఆర్థిక పరిస్థితులు, ఓపెన్ మార్కెట్లో బొగ్గు కొనుగోలు చేసే పరిస్థితి పోటీలో నిలబడాలంటే ఏం చేయాలి అనే విషయాలను సింగరేణి అధికారులు కార్మికులకు భోజనం పెట్టి వివరించాలని, ఆఫ్ డే లీవ్ ఇచ్చి మరి విషయాలను వివరించాలని సింగరేణి అధికారులకు తెలియజేసినట్లు తెలిపారు. సమావేశంలో మినిమం వేజ్ బోర్డు చైర్మన్ జనక ప్రసాద్, కార్మిక సంఘం నాయకులు ధర్మపురి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన ఆదేశాలు

-టిడిపి యువనేత మురుగుల ప్రసాద్



**విస్సన్నపేట,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో నాలుగవ వార్డులో పారిశుద్ధ సమస్యను యువ నాయకులు ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ మురుగుల ప్రసాద్ పరిశీలించారు. మురుగునీరు పోయేందుకు యుద్ధ ప్రాతిపదిక చర్యలు తీసుకునేందుకు గ్రామపంచాయతీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి మహిళా అధ్యక్షురాలు సంబారు నాగలక్ష్మి, గరిమెళ్ళ లోకేశ్వరరావు, వేమన, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టింగ్ జిల్లా స్థాయి పోటీలు



**తిరువూరు,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నాగు బండి రామారావు సామ్రాజ్యం v కన్వెన్షన్ నందు జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారం 14 వ తారీకు ఉదయం 9 గంటల నుండి పోటీలు ప్రారంభించబడుతున్నాయి. ఈ పోటీలో జిల్లాస్థాయి పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు పాల్గొని జయప్రదం చేయవలసిందిగా నిర్వహలు తెలియజేశారు

# మెరుగైన పరిశుద్ధ పనులు



**తిరువూరు,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** తిరువూరు మున్సిపల్ కమిష నర్ కే మనోజ్ మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు పట్టణములను వార్డు ల్లో ప్రజలకు ఎటువంటి డ్రైనేజీ సమస్య లేకుండా గౌరవ ఎమ్మెల్యే సూచన మేరకు కచ్చ డ్రైనేజీ పనులు ప్రారంభించాము సీజనల్ వ్యాధు లు వ్యాపించకుండా ప్రతిరోజు డ్రైనేజీలలో మురుగునీరు నిలవకుండా సిబ్బంది చేత డ్రైనేజీ పూడికతీతులు దోమల ప్రబలకుండా యాంటీ లార్వా ఆపరేషన్ ఫాగింగ్ మరియుప్రతిరోజు వార్డుల్లో మా సిబ్బంది చేత బ్లీచింగ్ చల్లిస్తున్నాము ప్రతిరోజు మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టామని ప్రజా ఆరోగ్య భద్రతే మా లక్ష్యం కమిషనర్ తెలిపారు

# టిడిపి నాయకులు తాతినేమీ సుజనా బాబు మృతి

-ఘన నివాళులర్పించిన టిడిపి శ్రేణులు..



**గన్నవరం, సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గం, ఉంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు తాతినేని సుజన బాబు మృతి చెందారు. వారి పార్థివదేహానికి పూలమాలవేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సోదరులు యార్లగడ్డ సతీష్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొండేటి వెంకటేశ్వరరావు,ఆత్కూరు గ్రామ అధ్యక్షులు రామ్ కిరణ్ ,మండల జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి అండగా గంగవరం మహిళలు



**రౌతులపూడి,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలం గంగవరం గ్రామంలో ఒక నిరుపేద కుటుంబాన్ని గుర్తించి మేమున్నాం అంటూ గంగవరం గ్రామ ఆడపడుచులు..ఆదర్శంగా నిలిచారు.అదే గ్రామానికి చెందిన ఏడిద గోవిందు గత కొన్ని నెలల నుంచి తీవ్ర అనారోగ్యానికి గురైనాడు. దీంతో ఏడద గోవిందు కుటుంబానికి రెండు నెలకు సరిపడ 50 కేజీల బియ్యం నిత్యవసర సరుకులతో పాటు వైద్యులు సూచనల మేరకు రాగులు, జొన్నలు రెండు నెలలకు సరిపడా సరుకులు అందజేసారు. తమ కుటుంబానికి మంచి మనసుతో సహాయం అందించిన మహిళలకు గోవిందు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వాడపల్లి బృందం పాల్గొన్నారు.

# రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గన్నవరం,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును.. రేపు అనగా సెప్టెంబర్ 13 , శనివారం ఉదయం 08:00 గంటల నుంచి మధ్యాహ్నం 13:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్న అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్పోర్ట్ సిటీ, స్లేట్ స్కూల్, గొల్లనపల్లి, బిబి గూడెం, ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు,పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు

# మండలంలో నెలకొన్న సమస్యలను సమిష్టి కృషితో పరిష్కరించుకుందాం - ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి

- మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులతో రివ్యూ నిర్వహించిన ఎంపీడీవో
- సురక్షిత మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యా వైద్యం పైనే సమీక్ష







**మైలవరం,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** మండలంలో నెలకొన్న సురక్షిత మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం, విద్యా వైద్యం వంటి సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని ఎంపీపీ ఇస్లావతు ప్రసన్న రాణి అన్నారు.స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశపు హాలులో ఎంపీడీవో పి.అనురాధ ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ ప్రసన్న రాణి మాట్లాడుతూ సమస్యలు ఉంటే సభ్యులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాల న్నారు.ముఖ్యంగా ప్రజలకు సురక్షిత మంచినీటి తో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలద్వారా నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. గ్రామాల ను స్వచ్ఛతగా మార్చుకుందామని పేర్కొన్నారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి, నివేదికలను సభలో సభ్యులకు వివరించారు.విద్య వైద్యం, ఇరిగేషన్, ఐసిడిఎస్, వ్యవసాయం,ఉద్యాన, విద్యుత్ శాఖ, వెలుగు పథకం,పంచాయితీ రాజ్, ఆర్ డబ్ల్యూ ఎస్, తదితర శాఖ అధికారులు నివేదికలను సభలో వివరించారు.సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కాలేదని,గైర్హాజర్ అయిన అధికారులపై ఆయా శాఖ ఉన్నతాధికా రులకు ఫిర్యాదు చేయనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో నియమతుల్లహ్ హెచ్చరించారు. ప్రస్తుతం కొత్త ఇల్లు శాంక్షన్ లేవని హౌసింగ్ ఏఈ తెలిపారు.మైలవరంలో విచ్చలవిడిగా నడుస్తున్న వాటర్ ప్లాంట్ లలో నీటి పరీక్షలు చేసి సురక్షితం కాదని తెలిస్తే అటువంటి వాటర్ ప్లాంట్లను సీజ్ చేయడం జరుగుతుందని ఆర్ డబ్ల్యూ ఎస్ ఏఈ వెల్లడించారు.ఉద్యాన పంటలకు ప్రభుత్వం రాయితీలు కల్పిస్తుందని, దీర్ఘకాలిక పంటలపై రైతులు ఆసక్తి చూపాలని ఉద్యాన శాఖ అధికారి సోహైల్ అహ్మద్ పేర్కొన్నారు.

**ఈ క్రాప్ బుకింగ్:** మైలవరం మండల వ్యాప్తంగా ఇప్పటివరకు 13500 ఎకరాలలో ఈ క్రాప్ బుకింగ్ జరిగిందని, ఖాళీ పొలాలను కూడా ఈ క్రాఫ్ట్ చేయించమని ఆదేశాలు వచ్చినట్లు వ్యవసాయ అధికారి కె.సంధ్యారాణి తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద 7400 మంది రైతుల కు రూ. 51 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయినట్లు తెలియజేశా రు.రైతులకు యూరియా తోపాటు కాంప్లెక్స్ చెరువులో కూడా అందుబాటులోనే ఉన్నాయని, ఇప్పటివరకు మండల వ్యాప్తంగా వెయ్యి టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగిందన్నారు. ద్రవరూపంలో ఉన్న నానో యూరియా, డిఏపి వాడుకోవాలని రైతులకు సూచించాల్సిందిగా సభ్యులను కోరారు.

**స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా....** స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా ప్రభుత్వం యంగ్ ప్రొఫెషనల్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, ఇండస్ట్రియల్, స్కిల్ డెవలప్మెంట్స్, బంగారు కుటుంబాలు అభివృద్ధి వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని ఎంపీడీవో పి.అనురాధ అన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 20 పేద కుటుంబాలను ఎడాప్ట్ చేసుకోవడం జరిగిందని తెలిపారు. 317 ఎకరాలలో ఉద్యాన పంటలు వేసేందుకు రైతులు ముందుకు వచ్చారన్నారు.

**ఆర్ ఎం పి క్లినిక్లను తనిఖీ చేస్తాం:** మైలవరం మండలంలో నడుస్తున్న ఆర్ఎంపి క్లినిక్ లలో దశలవారీగా తనిఖీలు నిర్వహిస్తామని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డా.సునీల్ తెలిపారు. తనిఖీలు చేసిన అనంతరం ప్రభుత్వ నిబంధన లకు విరుద్ధంగా నడుపుతున్న క్లినిక్ లపై సమగ్ర నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తామని వెల్లడించారు.

**పొదుపు డబ్బులలో సగం డబ్బులను ఫిక్స్ డిపాజిట్ చేయమంటున్నారు:** స్వయం సహాయక సంఘాలు (డ్వాక్రా గ్రూపులు) పొదుపు అకౌంట్లో ఉన్న సొమ్ములో సగం సొమ్మును బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేయమంటున్నారని,అసలు ఫిక్స్ డిపాజిట్ ఎందుకు చేయాలని ఓ గ్రామ సర్పంచ్ సభలో వెలుగు సిసి ని ప్రశ్నించారు.పొదుపులో రూ. 3లక్షలు ఉంటే రూ. 1.50 లక్షలను ఫిక్స్ డిపాజిట్ చేయాల్సిందేనని గ్రూపులపై ఒత్తిడి తేవడం సరికాదన్నారు.ఈ సమావేశంలో ఎంపిటిసి లు, వివిధ గ్రామాల సర్పంచ్ లు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు వద్దు




**కాకినాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా, చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ వారి అధ్వర్యంలో,కాకినాడ జిల్లాలోని టెంపుల్స్, చర్చి,మసీదులలో అవేర్నెస్ ప్రోగ్రాం ని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ జె.విజయ, క్రాఫ్ట్ కో-ఆర్డినేటర్ బి. కుమారి గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ టు ఎండ్ చైల్డ్ మ్యారేజ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈనెల 12, 13, 14 తేదీలలో గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లెడ్జ్ వీకెండ్ టు అండ్ చైల్డ్ మ్యారేజ్ కార్యక్రమాన్ని పురోహితులు, చర్చి పాస్టర్లతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుచున్నది.కాకినాడ జిల్లాలోని రామారావు పేట శివాలయం ప్రధాన అర్చకులు మోగంటి నాగ సుందర మోహన్ శర్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని వాటిని ప్రోత్సహించబోమని తెలిపారు. అదేవిధంగా జీవితంలోని ప్రతి దశకు దాని ఉద్దేశం ఉంటుందని భగవద్గీత మనకు బోధిస్తుంది. బాల్యం అనేది వివాహ వారాలకు కాదు సద్గుణాలను నేర్చుకోవడానికి, పెంపొందించవడానికి సమయం. బాల్య వివాహం ధర్మం నిర్దేశించిన పవిత్ర జీవిత ప్రయాణాన్ని భంగపరుస్తుంది. సమాజానికి హాని కలిగిస్తుంది మన పిల్లలు తమ విద్యను పూర్తిచేసి గౌరవంగా, స్వేచ్ఛతో యుక్త వయసులోకి అడుగు పెట్టేలా చూసుకోవడం ద్వారా ధర్మాన్ని నిలబెట్టుకుందాం అని వారు హిందూ ధర్మ శాస్త్రం ప్రకారం వచ్చిన భక్తులందరికీ తెలియజేశారు. అదేవిధంగా చర్చి ఫాదర్ నెహెమ్యా పిల్లలు ఒక దీవెన అని,ప్రేమ,రక్షణతో పెంచబడాలని బైబిల్ మనకు బోధిస్తుందని యేసు ఇలా అన్నాడు చిన్నపిల్లలను నా దగ్గరకు రానివ్వండి వారిని అడ్డుకోకండి ఎందుకంటే పరలోక రాజ్యం ఇలాంటి వారిదే (మత్తయి19:14) బాల్య వివాహం పిల్లల అమాయకత్వాన్ని విద్యను, ఆరోగ్యాన్ని దోచుకుంటుంది క్రీస్తు ప్రేమ, కరుణ అనుచరులుగా మనం అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడడానికి పిలవబడ్డాము పిల్లలను రక్షించడానికి చర్చిగా మనం ఐక్యంగా ఉందాం తద్వారా విశ్వాసంలో ,జీవితంలో వర్ధిల్లుతారని బైబిలు ప్రకారము చెప్పడం జరిగినది.తదుపరి జిల్లా బాలల పరిరక్షణ విభాగం పిఓఎన్ఐసి జె.విజయ మాట్లాడుతూఎక్కడైనా బాల్యవి వాహాలు జరుగుతున్న సమాచారం 1098 కి కాల్ చేయమని చెప్పటం జరిగింది. కార్యక్రమంలో మాగంటి నాగ సుందర్ మోహన్ శర్మ పూజారి,చర్చి ఫాదర్ నెహెమ్యా, జె.విజయ, పి ఓ ఎన్ ఐ సి,జిల్లా చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ (క్రాఫ్) కోఆర్డినేటర్ బి.కుమారి, చిన్ని బాబు సోషల్ వర్కర్, దుర్గా రాణి కౌన్సిలర్, దుర్గ భవాని కేస్ వర్కర్, మాతాధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ లకు 42% అమలు చేయాలి..



**గుంటూరు,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** రాబోయే శాసనసభ సమావేశాలలో స్థానిక సంస్థల ఎన్నికలల్లో బీసీ లకు 42% రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలనీ అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వం ను డిమాండ్ చేసారు .బాపట్లలో జరిగిన విలేకర్ల సమావేశంలో వరప్రసాద్ యాదవ్, బీసీ ప్రముఖులు, భావపురి విద్యాసంస్థల డైరెక్టర్ ఆవుల వెంకటేశ్వర్లు, ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నవ సుబ్బారావు తో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహా లో డెటికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి ఏపీలో ఎన్టీఆర్ ఆశయ సాధనకు బీసీ లకు చంద్రబాబు ప్రభుత్వం 42% రిజర్వేషన్లు అమలు ఖరారు చేసాకే ఎన్నికలు నిర్వహించాలని వరప్రసాద్ యాదవ్ సీఎం కు విజ్ఞప్తి చేశారు. గత ఎన్నికలలో టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం బీసీ లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన కోరారు. రాష్ట్రంలో బీసీ వర్గాలపై జరుగుతున్న దాడులను ఆరికట్టేందుకు వెంటనే బీసీ సామాజిక రక్షణ చట్టం అమలు చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలని వరప్రసాద్ యాదవ్ కోరారు . ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం నుండి బీసీ లకు మినహాయింపు ఇవ్వాలని, బీసీ లు ఎస్సీ ఎస్టీ లు పై సామూహిక దాడులకు పాల్పడిన బీసీ లపై ఎస్సీ ఎస్టీ లు దాడులకు,సాంఘిక్ బహి స్కరణ లకు పాల్పడిన ఆయా చట్టాలు అమలు అయ్యేలా బీసీ సామాజిక రక్షణ చట్టం రూపకల్పన చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు కు వరప్రసాద్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. ఎన్ బీసీ ఎఫ్ డి సి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈ విలేకరుల సమావేశంలో ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పేరయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ మారణ హొమం నుండి తెలుగు ప్రజలను రక్షించిన నారా లోకేష్

- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల స్వామి
- ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



**నందిగామ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** శుక్రవారం రాష్ట్ర వైద్య ఆర్యోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) లతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ నేపాల్ జరుగుతున్న మరణ హొమంలో తెలుగు ప్రజలు చిక్కుకున్న విషయం తెలిసిన వెంటనే మంత్రివర్యులు నారా లోకేష్ అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని ఉదయాన్నే హుటాహుటిన సచివాలయానికి చేరుకున్నారన్నారు. రియల్టైం గవర్నెన్స్ సెంటర్ వార్ రూమ్ను కమాండ్ కంట్రోల్ రూమ్ గా మార్చి సహాయక చర్యలను వేగవంతం నారా లోకేష్ చేశారని తెలియజేసారు.బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఎక్కడెక్కడ ఉన్నారో లొకేషన్ కోఆర్డినేట్లతో సహా మ్యాప్ సిద్ధం చేయించారు. ఢిల్లీలోని ఏపీ భవన్లో అత్యవసర హెల్ప్ లైన్ ఏర్పాటు చేయడం, చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, నీరు, వసతి సదుపాయాలు కల్పించేలా చూసారని ఈ సందర్భంగా తెలియజేసారు. కేంద్రం అండతో సమన్వంతో ఈ ఆపదలో ఉన్న ఒక్కొక్కరినీ సురక్షితంగా రక్షించడానికి లోకేష్ పక్కా వ్యూహంతో ముందుకు కదిలారు.నేపాల్లో తెలుగువారు చిక్కుకుంటే జగన్రెడ్డి నుంచి కనీస స్పందన లేదు. మానవతాదృకృథంతో కూడా వ్యవహరించలేదు.గతంలో ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకుపోయిన తెలుగువారిని తీసుకురావడంలో, గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయిన వారిని స్వదేశానికి తీసుకురావడంలో చంద్రబాబు నాయుడు కీలకపాత్ర పోషించారని గుర్తు చేసారు.తెలుగు వారికి అపద అనే పదం వినబడితే చాలు నన్ను దాటి వారిని టచ్ చేయాలనే విధంగా ఆపదకే అడ్డుగా నిలిచారు నారా లోకేష్ అని కొనియాడారు.ఈ కార్యక్రమములో నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, వివిధ హొదాల చైర్మన్లు, వివిధ హొదాల కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# ఫిలిప్ బి స్వాతి లకు వివాహ శుభాకాంక్షలు





**దోర్నాల,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** ఎర్రగొండ పాలెం నియోజకవర్గం, దోర్నాల మండలం, రామచంద్ర కోట గ్రామంలో జరిగినటువంటి ఫిలిప్ ,స్వాతిల వివాహానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, కాటమరాజు దేవస్థాన అభివృద్ధి కాముకుడు, మాజీ లిడ్ క్యాప్ చైర్మన్ గూడూరు ఎరిక్సన్ బాబు తో పాటు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పి ఎల్ పి యాదవ్, దోర్నాల తెలుగుదేశం పార్టీ నాయకులు మహబూబ్, సుధాకర్ రెడ్డి లు మరియు పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నాయకులు మరియు టీడీపీ నేతలు, కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనీ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# జాతీయ పోటీలకు ఎంపికై జిల్లాకు మంచి పేరు తేవాలి - డా.బండి శ్యాంసుందర్రావు



**గూడూరు,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** సెప్టెంబర్ 12,13,14 తేదీలలో జరుగు 49 వ టెన్నికాయిట్ రాష్ట్ర స్థాయి సీనియర్ బాలబాలికల పోటీలు జరిగే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మండపేటకు బయలు దేరిన తిరుపతి జిల్లా టెన్నికాయిట్ జిల్లా జట్టుకు జిల్లా బాధ్యులు శుభాకంక్షాలు తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికై జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తిరుపతి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ బండి శ్యామ్ సుందర రావు (మయూరి శ్యామ్ యాదవ్ ) ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వర రావు, మల్లిఖార్జున పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసిన ఏపీటీఎఫ్



**పెనుగంచిప్రోలు,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :**మండల కేంద్రం అయిన పెనుగంచిప్రోలు లోని మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపుమేరకు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం లో భాగంగా సాయంత్రం 4 గంటలకు పెనుగంచిప్రోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి తహసీల్దార్ శాంతి లక్ష్మి కి ఏపీటీఎఫ్ సంబంధించిన సమస్యలు లను వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో ఎపిటీఫ్ జిల్లా నాయకులు శెట్టిపోగు రాము, నాగరాజు, గిరి రవి శ్రీనివాస నాయక్, ముమ్మట్టి కిషోర్ ఉపాధ్యాయ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 14న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో "మహా అన్న సమారాధన"

- 12వేల మందికి విందు భోజనం ఏర్పాట్లు చేస్తున్నాం: దేవస్థాన కమిటీ చైర్మన్ సాయన రాజేష్.. ఎమ్మెల్యే రాము చేతుల మీదుగా మహా అన్న సమారాధన ప్రారంభం కానున్నట్లు వెల్లడి..



**గుడివాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** పట్టణంలో ప్రసిద్ధిగాంచిన మెయిన్ రోడ్డు లోని శ్రీ విఘ్నేశ్వర దేవస్థానంలో గణపతి నవరాత్ర మహెూత్సవాలు అత్యంత వైభవంగా ముగియడంతో 14వ తేదీ ఆదివారం శాంతి నిమిత్తం మహా అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కమిటీ చైర్మన్ సాయన రాజేష్ తెలియజేశారు. అన్న సమారాధనను పురస్కరించుకొని ఎమ్మెల్యే వెనిగండ్ల రామును రాజేంద్రనగర్ లోని ఆయన స్వగృహంలో కమిటీ పెద్దలు శుక్రవారం ఉదయం కలిశారు. మహా అన్న సమారాధన ఏర్పాట్ల వివరాలను కమిటీ చైర్మన్ రాజేష్ ఎమ్మెల్యే రాముకు వివరించారు. సమారాధనను ప్రారంభించాల్సిందిగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామును కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం సాయన రాజేష్ మాట్లాడుతూ దేవుడి ఆశీస్సులు, భక్తుల సహకారంతో దేవస్థానంలో ఉత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయన్నారు. వేడుకలు వైభవంగా ముగిసిన సందర్భంగా ఆదివారం మహా అన్న సమారాధన ప్రారంభిస్తున్నామని, పెద్ద సంఖ్యలో భక్తులు సమారాధనలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈ సందర్భంగా రాజేష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, దేవస్థాన కమిటీ సభ్యులు లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, రమణమూర్తి, పోతురాజు, వీరమాచినేని శైలజ, విజయలక్ష్మి, శారద, దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీ నరసింహ కాలనీవాసులు ఎంపీ ఈటెల రాజేందర్ ను కలిసి

## వారి సమస్యలను పరిష్కరించాలని వినతి





**జవహర్ నగర్, సెప్టెంబర్ 12:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహ కాలనీవాసులు మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులైన ఈటెల రాజేందర్ ని వారి నివాసం వద్ద కలిసి వారు గత పది ఏళ్లుగా లక్ష్మీనరసింహస్వామి కాలనీలో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నామని, పరంకుశం లక్ష్మణ్ మరియు అతని కొడుకు పవన్ గత కొన్ని నెలల నుండి లక్ష్మీనరసింహ కాలనీవాసులను మహిళలను, బెదిరింపులకు పాల్పడుతూ మా మాట వినకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరిస్తున్నారని ఆ కాలనీలో ఇల్లు నిర్మించుకుంటే తమకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని. ఈ మధ్యనే వేణు హత్య కేసులో జైలు నుండి బెయిల్ పై విడుదలయ్యామని ఎవరైనా మాకు అడ్డు వస్తే అంతు చూస్తామని బెదిరిస్తూ.. ఎవరైనా ఈ కాలనిలో ఇల్లు కట్టుకుంటే తమకు డబ్బులు చెల్లించాలని వేధింపులకు గురి చేస్తున్నట్లు కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.. ఈ విషయంపై లక్ష్మీ నరసింహ స్వామి కాలనీవాసులు తమ గోడును వెలిబుచ్చుకోవడానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఇంటికి వెళ్లి ఆయనకు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించిన ఈటల రాజేందర్ అన్న మేడ్చల్ కలెక్టర్ తో మాట్లాడడం జరిగింది.అనంతరం సంబంధిత పోలీస్ అధికారులు ఏసీపీ తో మాట్లాడి బాధితులకు భరోసాను ఇవ్వడం జరిగింది.అనంతరం బాధితులు కుషాయిగూడ ఏసీపీకి సార్ గారికి వినతి పత్రం సమర్పించి పోలీస్ అధికారులతో తాము పడుతున్న ఇబ్బందులను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీవాసులు, నాయకులు, కుల సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



**భద్రాద్రి కొత్తగూడెంజిల్లా సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** లక్ష్మీదేవిపల్లి, : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురం నుండి అనిశెట్టిపల్లి రోడ్డు వరకు రెండు కిలోమీటర్ల రోడ్డు, ముర్రేడు వాగు పై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఏడు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిన సందర్భంగా శుక్రవారం హేమచంద్రపురం లో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు చిత్రపటానికి సిపిఐ, కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేసారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, పిఎసిఎస్ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, మాజీ ఎంపీటీసీ కళ్లెం సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బండ వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ వజ్జా ఎర్రయ్య, కళ్లెం పూర్ణచంద్రరావు, యల్లావుల ఉపేందర్, బైకానీ కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు పథకం కోసం కాల్ సెంటర్

***ఒక్క కాల్‌తో... ఫిర్యాదు***
***జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్***



**జనగామ,** సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి) ఇందిరమ్మ ఇళ్ల పథకం మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు అలాగె లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. పేదవారి సొంతింటి కల సాకారం కోసం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా నిర్మాణలకు సంబందించి దశలవారిగా లబ్ధిదారులకు మొత్తం రూ.5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చేస్తుంది. ఈ క్రమంలోఇల్లు నిర్మాణం సమయంలో పలు అంశాలకు సంబంధించి లబ్ధిదారుల్లో అనేక అనుమానాలువస్తున్నాయని వీటికి సరైన సమాధానాలు చెప్పేందుకు,ప్రభుత్వం ప్రత్యేకంగా కాల్ సెంటర్ ఏర్పాటు చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు.హిమాయత్ నగర్‌లోని హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో దీన్ని ఏర్పాటు చేశారని,రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ కాల్ సెంటర్‌ను ప్రారంభించారన్నారు. దీనికి 1800 599 5991 టోల్ ఫ్రీనంబర్‌నుకేటాయించారని,ఉదయం 7 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పని చేసే ఈ కాల్ సెంటర్ కి లబ్ధిదారులు, సామాన్య ప్రజల నుంచి ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వచ్చే ఫిర్యాదులు, సమస్యలను సిబ్బంది తెలుసుకుని, వాటిని నోట్ చేసుకుని సంబంధిత అధికారులకు పంపి పరిష్కారం అయ్యేలా చూస్తారన్నారు.అంతే కాకుండా లబ్ధిదారులే నేరుగా వెబ్ సైట్ లో వారి ఇంటి నిర్మణాలకు సంబందించిన ఫోటో లను అప్ లోడ్ చేసుకునే అవకాశాన్ని అలాగే వారి వివరాలను సమర్పిస్తే బిల్స్ స్టేటస్ ను తెలుసుకునే అవకాశాన్ని కూడా ప్రభుత్వం కల్పించదన్నారు.అర్హులైన లబ్ధిదారులు వారి సొంత ఇంటి కలను నెరవేర్చుకునే క్రమం లో ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా మొదటి నుండి ప్రభుత్వం అనేక రకాలుగా చర్యలు తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పూర్తి పారదర్శకంగా అమలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

# ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించడం అదృష్టంగా భావిస్తున్నా

***కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద***



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12, (వార్తాప్రభ) :** బడ్జెట్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారిని సత్కరించే అవకాశం తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు, టిఆర్ఎస్ ఎల్ పి విప్ కీపి వివేకానంద అన్నారు. తెలంగాణ గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రాపసా ) ఆధ్వర్యంలో సూరారం లోని విఐపి ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 60 ప్రైవేటు పాఠశాలలకు చెందిన 120 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలు అత్యధికంగా నివసించే కుత్బుల్లాపూర్ లో బడ్జెట్ పాఠశాలల పాత్ర అత్యంత కీలకంగా ఉందన్నారు. ఇలాంటి పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారు ఎంతో అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. బడ్జెట్ పాఠశాలల వల్ల సామాన్యులకు కూడా అత్యున్నత విద్య అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బడ్జెట్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను సత్కరించాలనే ఆలోచన గొప్ప విషయం అన్నారు. ఉపాధ్యాయులు మరింత అంకుఠ దీక్షతో పనిచేసేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం నిర్వహించిన ట్రాపసా సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ సుధీర్ సంద్ర ఉపాధ్యాయుని గొప్పతనంపై సుదీర్ఘంగా ప్రసంగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, దుండిగల్ ఎం ఈ ఓ కిషన్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు రామేశ్వర్ రెడ్డి, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్ రెడ్డి, ఆంజనేయులు, కోశాధికారి గిరిబాబు, ట్రాపసా చైర్మన్ కోలా వెంకటేష్, కుత్బుల్లాపూర్ అధ్యక్షులు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, కార్యనిర్వహక కార్యదర్శి మధు, సీనియర్ కరస్పాండెంట్లు నరసింహులు గౌడ్, భూపాల్ రెడ్డి, దుర్గారావు, ప్రవీణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సి ఎచ్ నర్సింహాలు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ కలిసిన జవహర్ నగర్ శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సంఘం జేఏసీ నాయకులు



***సెప్టెంబర్ 17న జరగబోయే యజ్ఞ మహోత్సవ కార్యక్రమానికి రావాలని ఆహ్వానం***

**జవహర్ నగర్, సెప్టెంబర్ 12:(వార్తా ప్రభ)**జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సంఘం జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ స్వగృహంలో మేడ్చల్ జిల్లా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమ్యూనిటీ హాల్ వద్ద సెప్టెంబర్ 17న జరగబోయే యజ్ఞ మహోత్సవ కార్యక్రమానికి యజ్ఞ కమిటీ ఆహ్వాన పత్రిక ఇచ్చి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మను మయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటికొండ శ్రీరాములు చారి, జేఏసీ అధ్యక్షులు మారోజు సోమాచారి, జేఏసీ ప్రధాన కార్యదర్శి కేకే చారి, జేఏసీ ఉపాధ్యక్షులు కర్ణ కంటి పుల్లయ్య చారి, కార్యదర్శి మారోజు నరసింహ చారి, యజ్ఞ కమిటీ అధ్యక్షులు శ్రీరామదాసు వెంకటరమణాచారి, ప్రధాన కార్యదర్శి నల్ల నాగుల రమేష్ చారి, కోశాధికారి ఆకునూరి నగేష్ చారి, ఉపాధ్యక్షులు మారోజు రమేష్ బాబు, కేశవుల రాం బ్రహ్మాచారి, బి తోజు రామాచారి, ఉపాధ్యక్షులు లక్కుంట్ల రుద్రాచారి, యజ్ఞ కమిటీ కార్యదర్శి రాళ్ల బండి భైరవ చారి, అందోజు నరసింహ చారి, సంయుక్త కార్యదర్శి, వగులోజు నవీన్ చారి, శ్రీరామోజు వెంకటాచారి,యజ్ఞ కమిటీ సలహాదారులు గాలయ చారి, ప్రచార కార్యదర్శి కాయతోజు సత్యం చారి, తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 పోస్టులు అమ్ముకుంటారా?

● **బి.ఆర్.ఎస్. వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.ఆర్.**



**హైదరాబాద్ , సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గ్రూప్ 1 పోస్టుల కోసం డబ్బులు చేతులు మారాయని పలువురు విద్యార్థులు చేస్తున్న ఆరోపణలపైన ప్రభుత్వం స్పందించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు.ప్రభుత్వంలోని మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయం గ్రూప్ 1 అభ్యర్థుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు నేరుగా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ అంశంలో తగిన విచారణ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రూప్ 1 పోస్టుల కోసం భారీగా డబ్బులను డిమాండ్ చేసినట్లు పలువురు విద్యార్థులు మీడియాలో చేస్తున్న ఆరోపణలపైన కెటిఆర్ ఒక ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి కష్టపడి,తమ విలువైన సమయాన్ని, తల్లిదండ్రుల కష్టార్జితాన్ని వెచ్చించి పోటీ పరీక్షలు రాసే తెలంగాణ యువత నమ్మకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేసిందని తీవ్రంగా విమర్శించారు. హైకోర్టు ఆదేశించినట్టుగా గ్రూప్ 1 పరీక్షను మళ్లీ తాజాగా, ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే, పరీక్షల్లో జరిగిన అవకతవకలపై ఒక జుడీషియల్ కమిషన్ వేసి, ఉద్యోగాలను అమ్ముకున్న దొంగలెవరో తేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇది నిరుద్యోగులకు న్యాయం చేకూర్చడమే కాకుండా, భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు పునరావృతం కాకుండా నిరోధిస్తుందని అభిప్రాయపడ్డారు. గ్రూప్ 1 పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఇది నిరుద్యోగుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చిందని ఆరోపించారు.

**ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలి** కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, కాసుల కక్కుర్తి కలిసి అనేక అవకతవకలకు కారణమయ్యాయని కెటిఆర్ మండిపడ్డారు. అంగట్లో కొలువులు అమ్ముకొని నిరుద్యోగుల గొంతు కోసిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీని ఒక వ్యాపారంగా మార్చిందని ఆరోపించారు. అందుకే కోట్లాది రూపాయలను తీసుకొని పోస్టులను అమ్ముకుందని పలువురు విద్యార్థులు చేస్తున్న ఆరోపణలను ప్రస్తావించారు. ఈ ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ఫెయిల్ అవ్వడం వల్ల యువత నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయిందని, ఈ వైఫల్యాన్ని వారు ఎప్పటికీ క్షమించరని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ చేసిన మోసపూరిత వాగ్దానంపై ప్రత్యేక అసెంబ్లీ సెషన్ ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించాలని, కేవలం మాటలతో కాకుండా చేతల్లో చూపించి యువత ఆశలను నెరవేర్చాలని సూచించారు.

# హెూప్ ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

***కొండా విజయకుమార్ జన్మదిన సందర్భంగా సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకం. శాసనసభ్యులు అరికెపూడి గాంధీ***



**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ):**హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ లో హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదానం శిబిరంలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్,సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తో కలిసి శాలవతో సత్కరించి,పుష్పగుచ్ఛం అందచేసి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేసి,రక్తదానం శిబిరంలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందజేశారు.ఈ సందర్భంగా పిఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ హెూప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నా అని,పుట్టిన రోజు సందర్భంగా మహా రక్త దానం శిబిరం నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం అని,ఇది శుభపరిణామం అని హెూప్ ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయం అని, అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి,రక్తదానం చేసిన వారికి ప్రత్యేక అభినందనలు తెలియజేసారు.స్వచ్ఛంధంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం చాలా సంతోషకరమైన విషయం అని,మంచి స్పందన వచ్చినది అని,అన్ని దానంల కన్నా రక్తదానం గొప్పది అని,ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత గా తప్పనిసరిగా రక్తదానం చేయాలని,నిండు ప్రాణాలను కాపాడినవారు అవుతారు అని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ఇతర ప్రాణాలు కాపాడిన దైవ సమానులు అవుతారు అని కావున ప్రతి ఒక్కరు స్వచ్ఛంద గా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి సీఎం నిరంతర కృషి

## ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

**జగిత్యాల,సెప్టెంబర్ 12 (వార్తాప్రభ):::** తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని సి.ఎం సహకారంతో నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి నిరంతర కృషి జరుగుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణం లోని 12వ వార్డు లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 20 లక్షల నిధులతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన, 11వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన లైబ్రరీ నీ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రాన్ని ఎఫ్ఆర్బీఎం నిధులు 30 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో విద్య అభివృద్ధికి నిరంతర కృషి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన మెడికల్ కళాశాలలో లేడీస్ హాస్టల్ పనులు జరుగుతున్నాయని అన్నారు.గొల్లపెల్లి సోషల్ వెల్ ఫేర్ డిగ్రీ కళాశాల ను పునః ప్రారంభం చేయటం జరిగిందని ఇది బీద మధ్యతరగతి పిల్లలకు చాలా ఉపయోగమన్నారు. టి ఆర్ నగర్ వద్ద ఏటీసీ కేంద్రం కూడా పూర్తి అయిందన్నారు.

# హైదరాబాద్

## కాంగ్రెస్ నాయకులు గొంటి పెద్ద మల్లేష్ యాదవ్ 23వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

***పాల్గొన్న మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచంద్రరావు తదితర ప్రముఖులు***





**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొంటి పెద్ద మల్లేష్ యాదవ్ 23వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం అమీర్ పేట, ఎల్లారెడ్డి గూడలో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎల్లారెడ్డి గూడ, అమ్మవారి టెంపుల్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు గొంటి శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులుగొంటి కుమార్ చౌదరి యాదవ్, గొంటి రవీందర్ యాదవ్, గొంటి విక్రమ్ యాదవ్ ,గొంటి సాయినాథ్ యాదవ్ , కిట్టు గౌడ్ , రామ గౌడ్, శీను, వినోద్ ,వేణు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ని ఆహ్వానించిన కాథలిక్ చర్చి సభ్యులు



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 131 కుత్బుల్లాపూర్ డివిజన్, పద్మనగర్ ఫేస్-2 సెయింట్ మేరీ సిరో-మలబార్ కాథలిక్ చర్చి సభ్యుల ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన నిర్వహించే సెయింట్ మేరీ జనోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానన్ని స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమలో బ్లాక్ ఎ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ గౌడ్, పులి సందీప్ గౌడ్, ఫాదర్ మణు, మిస్టర్ లేజీ, మిస్టర్ జర్జ్, మిస్టర్ జోమీ గార్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ నగర్ వైకుంఠధామాన్ని మోడల్ గ్రేవ్ యార్డ్" గా తీర్చిదిద్దుతాం

***: బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్***



**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ 128 - చింతల్ డివిజన్ కి చెందిన సంక్షేమ సంఘాల నాయకులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి భగత్ సింగ్ నగర్ స్మశాన వాటిక ను అభివృద్ధి పరచాలని, అభివృద్ధిలో భాగంగా చెట్ల పొదల తొలగింపు, నీటి సౌకర్యం, స్మశాన వాటిక లోని మౌలిక వసతులు, స్నానాల గదుల నిర్మాణం, కాపలాదారుడి ఏర్పాటు, దహన వాటిక, స్టోర్ రూమ్, వాచ్ మెన్ రూమ్, వాహనాల పార్కింగ్, గ్యాలరీ వంటి ఇబ్బందులను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.... బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు వైకుంఠధామాలకు కోట్లాది రూపాయల నిధులతో అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కూడా భగత్ సింగ్ స్మశాన వాటికను అభివృద్ధి పరిచి సమీప కాలనీ వాసులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేగ కృష్ణమూర్తి చింతల్, చంద్రా నగర్, భగత్ సింగ్ నగర్, దుర్గయ్య నగర్, రంగా నగర్, స్టార్ లైట్ అపార్ట్మెంట్, స్ఫూర్తి నగర్, ఆదర్శ్ నగర్, వైఎంఎస్ కాలనీ, సాయి కాలనీ, శివా నగర్ కాలనీల సంక్షేమ సంఘాల సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## జగన్ వర్సెస్ షర్మిల.. ఏపీ నాడి తెలిసే చేస్తున్నారా.. !


వైసీపీ అధినేత జగన్, ఆయన సోదరి, కాంగ్రెస్ పార్టీ ఏపీ చీఫ్ షర్మిల మధ్య వారసత్వ పోరు తెరమీదికి వచ్చింది. వైఎస్ వారసత్వం తమదేనని.. తమ కుమారుడే.. వైఎస్‌కు అసలు సిసలు రాజకీయ వారసుడని షర్మిల ప్రకటిం చారు. ఇక, ఇప్పటి వరకు వ్యాపారాలు చేసినా.. రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయినా.. తాను వైఎస్ వారసు డిగానే ప్రజలకు చేరువ అవుతున్నట్టు జగన్ చెప్పుకొస్తున్నారు. ఈ పరిణామాలపై అన్నాచెల్లి ఎలా ఉన్నా.. ఎన్ని వాదనలు చేసుకున్నా.. చివరకు వారసత్వం తేల్చాల్సింది.. మాత్రం ప్రజలే. ప్రజలు నమ్మి.. ఒప్పుకొని ఆశీర్వదిస్తేనే వైఎస్ వారసత్వం ఎవరికనేది దక్కుతుంది. అయితే.. ఈ విషయంలో పర స్పరం కీచులాడుకుంటే.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుని రోడ్డెక్కితే.. చివరకు ఇద్దరినీ కూడా ప్రజలు పక్కన పెట్టే అవకాశం ఉంది. ఉదాహరణకు అన్న నందమూరి వారసుడిని నేనే అంటూ.. అప్పట్లో హరికృష్ణ వచ్చారు. అన్న తెలుగు దేశం పార్టీ పెట్టారు. ఇదేసమయంలో కాదు, అసలు సిసలు వారసత్వంనాదే అంటే.. లక్ష్మీపార్వతి ముందుకు వచ్చారు. ఎన్టీఆర్ టీడీపీ అంటూ.. ఆమె మరో పార్టీ పెట్టారు. ఈ ఇద్దరి కీచులాటలను ప్రజలు సహించలేక పోయారు. ఫలితంగా.. అసలు సిసలు టీడీపీ చంద్రబాబు దేనని తేల్చేశారు. ఫలితంగా హరికృష్ణ, లక్ష్మీపార్వతులు ఇద్దరూ పార్టీలను ఎత్తేసుకోవాల్సి వచ్చింది. ఇక, ఇప్పుడు ఏపీలోనూ అలాంటి పరిణామాలే తెరమీదికి వచ్చే అవకాశం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ఎందుకంటే.. ప్రజలు కీచులాటలను సహించరు.. సహకరించరు కూడా. 2019 ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ , బీజేపీలు కీచులాడుకున్నారు. ఎవరికి వారు రాజకీయాలు చేసుకున్నారు. ఫలితంగా ప్రజలు ఈ మూడు పార్టీలను పక్కన పెట్టారు. అదే.. 2024కు వచ్చే సరికి.. మూడు పార్టీలు కలిసి ప్రజల ముందుకు రావడంతో నెత్తిన పెట్టుకున్నారు. సో.. దీనిని బట్టి ఏపీ ప్రజల నాడి.. కీచులాటలకు.. వివాదాలకు ప్రాధాన్యం ఇవ్వదన్న విషయం స్పష్టం అవుతూనే ఉంది. ఈ విషయాన్ని అటు షర్మిల.. ఇటు జగన్ కూడా మరిచిపోయినట్టు తెలుస్తోంది. అయితే.. షర్మిల కీచులాడినా.. ఏం చేసినా.. ప్రజలు ఆమెను ఆదరించినా.. ఆదరించకపోయినా.. ఇబ్బంది లేదు. ఎటొచ్చీ.. జగన్ మాత్రం జాగ్రత్త పడకపోతే.. కీచులాటకు దిగి.. యాగీ చేస్తే.. అది ఆయనకు .. వైసీపీకి కూడా తీవ్రనష్టం జరిగే అవకాశం కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. వేసే ప్రతి అడుగు మరింత జాగ్రత్తగా పడాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

## కీర్తి చక్ర పందిళ్లపల్లి శ్రీనివాస్ సేవలు ఆచారణీయం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏపీ పి.టి.డి(ఆర్టీసీ)బి.సి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎస్పీ. శేషగిరిరావు ఆధ్వర్యంలో తెలుగు తేజం, కీర్తిచక్ర దివంగత పందిళ్ళపల్లి.శ్రీనివాస్(ఐ.ఎఫ్.ఎస్) 71వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మహిళలలకు పండ్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన వక్తలు మాట్లాడుతూ మూడు రాష్ట్రాలను గడగడలాడించిన గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ మొట్టమొదటిసారి అదుపులోకి తీసుకొన్న యువ ఐ.ఎఫ్.ఎస్ ఆఫీసర్, అలాగే గాంధీ , వినోదాభావే గార్ల స్ఫూర్తితో హింస ద్వారా కాకుండా అహింస ద్వారా ఈ స్మగ్లర్లు అరికట్టటానికి వీరప్పన్ సొంత గ్రామంతో పాటు ఆ ప్రాంతంలోనీ అనేక గ్రామాలకు, రహదారి సౌకర్యం, విద్య కోసం పాఠశాలను ఏర్పాటు చేయటం, వైద్య సదుపాయాల కోసం మొబైల్ హాస్పిటల్స్ ను ఏర్పాటు చేయడమే కాకుండా డాక్టర్లు అందుబాటులో లేకపోతే తానే ప్రాథమిక ఆరోగ్యంపై పై శిక్షణ పొంది వైద్యులు అందుబాటులో లేని సమయంలో ప్రాథమిక చికిత్సలు నిర్వహించిన మహోన్నతుడని పలువురు ఆయన సేవలు కొనియాడారు. అంతే కాకుండా గిరజన గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాల కోసం ఆటవి ఉత్పత్తులు అమ్ముకునేందుకు మార్కెట్లు ఏర్పాటు చేయటం, అర్హులైన వారికి గార్డుగా, వాచర్లుగా ఉద్యోగాలు పొందే విధంగా కృషి చేయడం, అలాగే వారి ఆరాధ్య దేవత మరియమ్మన్ నకు తన సొంత నిధులతో ఆలయాన్ని ఏర్పాటు చేయడం లాంటి అనేక సంస్కరణలు చేసిన మహానుభావుడు శ్రీ పందిల్లపల్లి శ్రీనివాస్, వారి ఉద్యోగ నిర్వహణ ఈరోజు ముస్సోరీలో ఒక సబ్జెక్టుగా బోధిస్తున్నారంటే వారు చేసిన సేవలే ఉదాహరణ అని, అలాంటి మహోన్నత వ్యక్తి మన తెలుగు వారు అవటం మనందరికీ గర్వకారణం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి మీడియా కోఆర్డినేటర్ యేదుపాటి రామయ్య, 42 డివిజన్ జనసేన అధ్యక్షులు శ్రీమతి తిరుపతి అనూష, హెచ్ బి కాలనీ ఎస్సీ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రామారావు,బుజ్జి, బీసీ సంఘం నాయకులు ఏ వి ఎస్ ఎన్ ప్రసాద్, వెంకటేశ్వరరావు, టీ.పూర్ణయ్య ,ప్రమీల, పార్వతి, అమృత,ఏం మోజేస్, కృష్ణ,రాజు, తదితరులు పాల్గొని వారికి నివాళులర్పించారు.

## తాతయ్య పలుకులు



ఆదర్శంగా జీవిద్దాం
చక్కనైన ప్రవర్తనతో
మేటియైన పరివర్తనతో
సూర్యునిలా ప్రకాశించాలి
చంద్రకాంతిలా మారాలి
పవిత్రమైన బంధంతో
వెలుగులీనే జ్ఞానంతో
పదిమందికి సాయపడాలి
వారి గుండెల్లో నిలవాలి
పనికొచ్చే యోచనలతో
గుర్తుండే మంచితనంతో
ఆణిముత్యమే కావాలి
మానవత్వమే మెరియాలి
పిల్లలలాంటి పలుకులతో
మల్లెలలాంటి మనసులతో
అందరినిల అలరిద్దాం

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు, 9966414580

# అభివృద్ధిలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

● ఐఎంఈసిఇ ఇండియా-2025 సదస్సులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● 2047 నాటికి సువర్ణ ఆంధ్ర నిర్మాణం ● ఎంఎస్ఎంఈ పాలసీ 4.0లో పెట్టుబడి సబ్సిడీలు









**హైదరాబాద్, సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఒక కుటుంబం – ఒక వ్యాపారవేత్త లక్ష్యంతో 2027 నాటికి ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పుతున్నామని ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్పీ, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. హైదరాబాద్‌లో ఏఎస్ఎంఈ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ మెకానికల్ ఇంజినీరింగ్ కాంగ్రెస్ %డ% ఎక్స్‌పోసిషన్ 2025లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికను వివరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 166 బిలియన్ అమెరికన్ డాలర్ల జీఎస్‌డీపీ, ఆరు పోర్టులు, మూడు అంతర్జాతీయ విమానాశ్రయాలతో తూర్పు దేశాలకు గేట్వేగా ఎదుగుతోందని తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీ 4.0లో పెట్టుబడి సబ్సిడీలు, టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, పన్ను రాయితీలు వంటి అనేక ప్రోత్సాహాలు ఉన్నాయని వివరించారు. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, అలాగే విశాఖ, రాజమహేంద్రవరం, తిరుపతి, ఎన్టీఆర్ జిల్లా, అనంతపురంలో ప్రాంతీయ కేంద్రాలు ప్రారంభమవుతున్నాయని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో 9.2 లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టులు ఆమోదమయ్యాయని, సెమీ కండక్టర్, ఐటి, క్వాంటం టెక్నాలజీలలో రాష్ట్రం ముందడుగు వేసిందని పేర్కొన్నారు. 2047 నాటికి సువర్ణ ఆంధ్ర నిర్మాణం లక్ష్యమని, నవంబర్ 14-15న విశాఖపట్నంలో జరిగే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్%-%2025కు పెట్టుబడిదారులను ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు, ఎంఎస్ఎంఈల వృద్ధి, క్లస్టర్ అభివృద్ధి, మార్కెట్ లింకేజీలపై ప్రభుత్వ ప్రయత్నాలను వివరించారు. చంద్రబాబు నాయుడు నేతృత్వం వల్ల హైదరాబాదు టెక్‌హబ్‌గా ఎదిగిందని, అదే దిశలో నూతన ఆంధ్రప్రదేశ్ కూడా బలమైన తయారీ కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని అన్నారు.

# మార్కెటింగ్ నైపుణ్యాలే లాభాలకు మూలం





**విజయవాడ పశ్చిమ, సెప్టెంబరు 12:(వార్తా ప్రభ ప్రతినిధి)**వినియోగదారుల అవసరాలు, మార్కెట్ ట్రెండ్స్, పోటీ పరిస్థితుల ఆధారంగా మార్కెంటిగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని, వ్యాపారంలో వాటిని అనువర్తింపజేయడం ద్వారా చక్కటి లాభాలు పొందటం సాధ్యమవుతుందని, అశోక టాల్కం పౌడర్ సేల్స్ అండ్ మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ రసేష్ అన్నారు. కెబిఎన్ కళాశాల ఎంబిఏ విభాగం ఆధ్వర్యాన శుక్రవారం మీట్ ద సీఈఓ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రసేష్ మాట్లాడుతూ సోషల్ మీడియా, డిజిటల్ మార్కెటింగ్, కస్టమర్ సెంట్రిక్ సర్వీసులు ఆధునిక మార్కెటింగ్‌లో ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. ప్రతి సంస్థకు ప్రత్యేకమైన ఆర్గనైజేషన్ కల్చర్ ఉంటుందని, ఉద్యోగుల విలువలు, నమ్మకాలు, పనితీరు విధానం, లీడర్‌షిప్ శైలిని ప్రతిబింబిస్తుందన్నారు. గూగుల్ వంటి సంస్థలు ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించే కల్చర్‌ను అభివృద్ధి చేస్తే, టయోటా వంటి సంస్థలు క్రమశిక్షణ, క్వాలిటీ మేనేజ్‌మెంట్ కల్చర్‌ను అవలంబిస్తాయని చెప్పారు. ఆర్గనైజేషన్ డైనమిక్స్ సంస్థలో జరిగే అధికార, కమ్యూనికేషన్, లీడర్‌షిప్, టీమ్‌వర్క్ వంటి అంశాలను సూచిస్తుందని, ఈ డైనమిక్స్ సానుకూలంగా ఉన్నప్పుడు ఉద్యోగులలో మోటివేషన్ పెరిగి, ఉత్పాదకత ఉన్నతస్థాయికి చేరుకుంటుందన్నారు. కోకా-కోలా, ఆపిల్, అమెజాన్ వంటి కంపెనీలు తమ బ్రాండ్ విలువను పెంచుకునేందుకు నూతన మార్కెటింగ్ స్ట్రాటజీలను అనుసరిస్తాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద సంస్థలు తమ మార్కెటింగ్ ప్రాక్టీసెస్‌ను వినియోగదారుల అవసరాలు, మార్కెట్ ట్రెండ్స్, పోటీ పరిస్థితుల ఆధారంగా అభివృద్ధి చేసుకుంటుం టాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ చదువుతో పాటు అధునాతన వ్యాపార విధానాలు, మార్కెటింగ్ లో వస్తున్న కొత్త పోకడలను విద్యార్థులను అధ్యయనం చేయాలన్నారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరరావు, పి.ఎల్.రమేష్, విభాగాధిపతి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఎంబిఏ అధ్యాపకులు పి.స్వప్న అతిథి రసేష్ తో ముఖాముఖి నిర్వహించారు.

# మతిస్థిమితం లేక తిప్పిపోయిన తనయుణ్ని తన తండ్రికి అప్పగించిన కొత్తపేట పోలీసులు



**గుంటూరు సెప్టెంబర్ 12 ( వార్తాప్రభ ప్రతినిధి):–** గుంటూరు పశ్చిమ లా అండ్ ఆర్డర్ సబ్ డివిజన్ పరిధిలో గల పట్టాభిపురం పోలీస్ స్టేషన్ ఏరియాలోని చంద్రమౌళి నగర్ కు చెందిన చింతమనేని శ్యామ్ కుమారుడైన చింతమనేని మురళీకృష్ణ వయస్సు పదిహేను వసంతాలు అనే యువకుడు మతిస్థిమితం లేని కారణంగా తాము నివాసముంటున్న చంద్రమౌళి నగర్ లోని తన ఇంటి వద్ద నుంచి ఉన్నట్టుండి ఎటో వెళ్లిపోయాడని అంతుచిక్కని పరిస్థితులలో సంబంధిత పోలీస్ స్టేషన్ అయిన పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా సత్వరమే స్పందించిన పట్టాభిపురం ఠాణా వర్యులు మతి స్థిమితం లేక తిప్పిపోయిన యువకుడు గురించి అన్ని పోలీస్ స్టేషన్లకు సమాచారాన్ని చేరయేసిన నేపథ్యంలో భాగంగా గుంటూరు తూర్పు లా అండ్ ఆర్డర్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట పోలీస్ స్టేషన్లో అర్ధరాత్రి వేళల్లో ప్రజా రక్షణ విధులలో కొనసాగుతున్న కొత్తపేట పోలీస్ స్టేషన్ యస్.ఐ యం. రమేష్ మరియు వారి సిబ్బందికి కొత్తపేటలోని ఉమామహేశ్వర స్వామి దేవాలయం (శివాలయం) ఏరియాలో అర్ధరాత్రి వేళ సుమారు గం1.30 నిమిషాల సమయమందు మతిస్థిమితం లేని యువకుడు రోడ్డుపై అటు ఇటు తిరగటాన్ని రాత్రివేళ గస్తీ విధులు నిర్వహిస్తున్న కొత్తపేట పోలీసులు గమనించి ఆ యువకుడుని తమ అదుపులోకి తీసుకుని సంబంధిత అధికారులకు విధిగా సమాచారాన్ని చేరవేసి అటు తర్వాత అధికారుల సూచనలతో మతిస్థిమితం లేని మురళీకృష్ణ పితామహుడైన శ్యామ్ కు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదులో ఇచ్చిన చరవాణి నెంబర్ సహాయంతో తన సుకుమారుడు తప్పిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబానికి సమాచారాన్ని అందచేసి కొత్తపేట పోలీస్ స్టేషన్ కు పిలిపించి మతిస్థిమితం లేని యువకుడుని తండ్రి చెంతకు చేర్చి పోలీస్ ఔదార్యాన్ని చాటుకున్నందులకు గుంటూరు జిల్లా ఎస్పీ యస్.సతీష్ కుమార్ కొత్తపేట పోలీసులను అభినందించారు. ఈసందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ తాను పోగొట్టుకున్న మా వారసుణ్ని శతవిధాలా అహర్నిశలుగా శ్రమపడి విశేష కృషితో తమ పిల్లాడిని అప్పగించిన కొత్తపేట పోలీసులకు మరియు జిల్లా పోలీస్ బాస్ కు కృతజ్ఞతలు చెప్పటమే కాకుండా ప్రజా రక్షకభటుల ఋణాన్ని ఎన్నటికిని తీర్చుకోలేమని కన్నీటిపరమైయ్యారు.

# జి ఎన్ ఆర్ పాఠశాల్లో ఘనంగా అక్షర యజ్ఞం కార్యక్రమం



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అక్షరం మనలోని అజ్ఞానాన్ని తొలగించి మనలో వివేచన జ్ఞానాన్ని పెంచే ఈ అక్షరాన్ని మనం అందరం తప్పనిసరిగా నేర్చుకోవాలి. ఈ రోజుల్లో అక్షర జ్ఞానం లేనివారు చాలా విషయాల్లో వెనుకబడి పోవాల్సి వస్తుందని వేములపల్లి కేశవరావు అన్నారు .. జిఎన్నార్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థి వికాస వాహిని, పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులు తల్లిదండ్రులలో అక్షరాలు నేర్చుకోలేకపోయినటువంటి వారికి ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ద్వారా అక్షరాల నేర్పే కార్యక్రమం జిఎన్ఆర్ అక్షర యజ్ఞం అనే పేరుతో ఈరోజు ప్రారంభించారు. గత 15 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో చైతన్యం, విజ్ఞాన దాయకమైనటువంటి అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, బహుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నటువంటి విద్యా వికాస వాహిని అధ్యక్షులు వేములపల్లి కేశవరావు ఇంకా మాట్లాడుతూ విద్యార్థులుగా ఈరోజు తమ తల్లిదండ్రుల రుణం తీర్చుకునేటువంటి అవకాశం ఈ కార్యక్రమం మనకి కల్పిస్తుంది అన్నారు. విద్యార్థులు సాయంత్రం పూట అమ్మానాన్న విశ్రాంతిగా ఉన్న సమయంలో రోజుకి ఒక్కొక్క పదాన్ని నేర్పిస్తూ ఆరు నెలల్లో వారికి చక్కగా పుస్తకాలు చదివే స్థాయికి తీసుకెళ్లవచ్చు అంతేగాక విద్యార్థులకు ఒక మానసికమైనటువంటి ఆనందాన్ని, తృప్తిని కూడా ఈ కార్యక్రమాల ద్వారా తల్లిదండ్రులు తమ పిల్లలతో పాటు అక్షరాలు నేర్చుకుంటూ వారు కూడా అక్షరాస్యులుగా గుర్తింపబడతారని అన్నారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎస్ వి ఎన్ గణేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఒక యజ్ఞం లాగా తీసుకొని అక్షరాలు నేర్పే కార్యక్రమంలో మనం విజయవంతం గా ముందుకు వెళ్లాలని ఆరు నెలల్లో అక్షరాస్యులుగా అమ్మానాన్నని మార్చే ఈ యజ్ఞం మన పాఠశాలకు ఒక గర్వకారణంగా నిలుస్తుందన్నారు. విద్యా వికాస వాహిని సభ్యులు లక్ష్మణరావు గారు మరియు వర్మ, పాఠశాల ఉపాధ్యాయులు ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. విద్యా వికాస వాహిని గత సంవత్సరం నిర్వహించినటువంటి ఆన్లైన్ పిసి కార్యక్రమాలలో విజేతలుగా నిలిచిన ఈ పాఠశాల విద్యార్థినులు జాహ్నవి మరియు శశాంకులకు బహుమతులను జ్ఞాపికలను అందించారు విద్యార్థులందరూ తల్లిదండ్రులకు అక్షరాలు నేర్పటానికి అవసరమైనటువంటి నోట్ పుస్తకాలు మరియు విద్యార్థులకు స్ఫూర్తి కలిగించేటువంటి రచనలను బహుమతులుగా అందజేశారు.


## బాధితులకు ఎల్.ఓ.సి అందజేత



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎన్డీఏ కార్యాలయంలో అందజేసిన ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ 44 వ డివిజన్ , చెరువు సెంటర్ కు చెందిన సాలుగు చిరంజీవి కి మంజూరైన రూ 1లక్ష 70 వేల ఎల్ .ఓ. సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను బాధితుడి కుటుంబ సభ్యులకు ఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు. చెరువు సెంటర్ కు చెందిన సాలుగు చిరంజీవి (32 ) రోడ్డు ప్రమాదంలో గాయపడగా కాలు ఫ్రాక్చర్ అయింది. తనకి మరింత మెరుగైన వైద్యం అందించాలని,శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలపడంతో ఎల్. ఓ సీ .కొరకు ఎన్డీఏ కార్యాలయంలో దరఖాస్తు చేశారు.. మంజూరైన రూ 1లక్ష 70 వేల ఎల్. ఓ. సీ ను కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ అందజేశారు త్వరితగతిన ఎల్ .ఓ. సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా కు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు, సుజనా మిత్రా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## ముమ్మరంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలు ఏర్పాట్లు

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకలు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా, దసరా శరన్నవరాత్రుల ఉత్సవ వేడుకల ఏర్పాట్లలో, వీఎంసి మెయిన్ ఆఫీస్ వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న హోల్డింగ్ ఏరియాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి లక్ష్మీశ ఆదేశాల మేరకు వియంసి మెయిన్ ఆఫీస్ వద్ద గల ఎపిసిపిడీసీఎల్ ఆఫీస్ ప్రాంగణంలో హోల్డింగ్ ఏరియాను ఏర్పాటు చేసేందుకు అక్కడ పెరిగివున్న చెట్లను పిచ్చి మొక్కలను తొలగించే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రుల సందర్భంగా భక్తులకు ఎటువంటి లోపం లేకుండా విజయవాడ నగరపాలక సంస్థ త్రాగునీరు, మరుగుదొడ్లు, ఉచిత చెప్పుల స్టాండ్ వంటి ఏర్పాట్లు చేస్తోందని, 39 ప్రాంతాలలో 25 లక్షల వాటర్ బాటిల్స్, 35 లక్షల వాటర్ ప్యాకెట్స్ ను ఏర్పాటు చేయబోతున్నామని, 19 ప్రాంతాలలోను 405 తాత్కాలిక మొరుగుదొడ్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక దృష్టి సారించారని, దేశ, విదేశ నలుమూలల నుండి వచ్చే భక్తులకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు 1490 మంది సిబ్బందితో 24 గంటలు మూడు షిఫ్ట్ లలో పారిశుధ్య నిర్వాహణ, ప్రజల సౌకర్యార్థం ఆరు ప్రాంతాలలో ఉచిత చెప్పుల స్టాండ్లు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వీఎంసి మెయిన్ ఆఫీస్ లో కమాండ్ కంట్రోల్లో విజయవాడ నగరపాలక సంస్థ వారు ఏర్పాటు చేసిన ఏర్పాటులలో ఎటువంటి లోపం లేకుండా ఎప్పటికప్పుడు నివేదికలను సేకరిస్తూ, మౌలిక సదుపాయాలలో ఎటువంటి అవసరమైన వెంటనే కంట్రోల్ రూమ్ ద్వారా అందేటట్టు 24 గంటలు మూడు షిఫ్ట్ లలో సిబ్బంది పనిచేస్తారని, అంతేకాకుండా మోడల్ గెస్ట్ హౌస్ లో శాఖల సమన్వయంతో అక్కడ కూడా సిబ్బంది మరోవైపు పని చేయటానికి ఏర్పాట్లు చేశారని కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.

## నెల నెలా బాధ్యత గా అన్నసమారాధన చేస్తున్న కళ్ళే నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు

**పేదలకు ఆకలి తీర్చడమే కళ్ళే ట్రస్ట్ ముఖ్య ఉద్దేశము**
**46నెలలు నుండి ప్రతి నెల నిత్యాన్నదానం..**



**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పేదల ఆకలి తీర్చడమే కళ్ళే లలిత ట్రస్ట్ ముఖ్య ఉద్దేశమనిట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో స్వర్గీయ కళ్ళే లలిత జ్ఞాపకార్థం, కళ్ళే లలిత వీధిలో శుక్రవారం పేదలకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళ్ళే లలిత ట్రస్ట్ అధ్యక్షుడు కళ్ళే నాగేశ్వరరావు, డైరెక్టర్లు కళ్ళే సీతా మహాలక్ష్మి ,జయదుర్గ,మేఘవాణి పాల్గొని స్వర్గీయ కళ్ళే లలిత చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళ్ళే నాగేశ్వరరావు మాట్లాడుతూ దివంగత కళ్ళే లలిత భౌతికంగా దూరమైన నాటి నుండి ప్రతి నెల 12వ తేదిన క్రమం తప్పకుండా గత 46నెలలు నుండి పేదలకు సింగ్ నగర్ ప్రాంతంలోని కళ్ళే లలిత వీధి వద్ద అన్నసమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. తమకు కలిగిన ఆర్థిక స్థోమత బట్టి పేదలకు ఆహారాన్ని అందజేయడం జరిగిందని అన్నారు. కళ్ళే లలిత బ్రతికి ఉన్న రోజులలో పేదల ఆకలి తీర్చాలని తెలపడం జరిగిందని అందుకే ప్రతి నెల పేదలకు బోజనాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. రానున్న రోజులలో కళ్ళే లలిత ట్రస్ట్ సేవలు ద్వారా పేదలకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని ట్రస్ట్ అధ్యక్షులు కళ్ళే నాగేశ్వరరావు అన్నారు. ట్రస్ట్ డైరెక్టర్ ముప్పూరి హరీష్, ఎమ్.జశ్విన్,జి. ధ్రువన్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి కాన్ఫరెన్స్ కు వివరాలను సిద్ధం చేస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ.

**మచిలీపట్నం సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 15, 16 తేదీలలో నిర్వహించే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కు అవసరమైన వివరాలతో కూడిన నివేదికలను వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి కలెక్టరేట్ చాంబర్లో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ తో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15, 16 తేదీలలో రాష్ట్ర ముఖ్యమంత్రి సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్లో చర్చించే అంశాల పైన వివిధ ప్రభుత్వ శాఖలు వారికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికలను సిద్ధం చేసి వెంటనే అందజేయాలన్నారు. మచిలీపట్నం ఓడరేవు నిర్మాణ పనులు 47 శాతం పూర్తయ్యాయని, నిర్మాణం పనులు మరింత వేగం పుంజుకోవాలన్నారు. వచ్చే సంవత్సరం మొదటి దశ పూర్తయ్యేలా పనులు మరింత వేగం పుంజుకోవాలన్నారు. పచ్చదనం పెంపుదలకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇందుకోసం అటవీ శాఖ వారితో సమన్వయం చేసుకోవాలన్నారు. గిలకలదిండి ఫిషింగ్ హార్బర్



నిర్మాణం పనులు కూడా వేగవంతం చేయాలని ఇప్పటికే చాలాసార్లు పొడిగించడం జరిగిందని సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం స్త్రీ శక్తి పథకం ఎలా నడుస్తుందో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మచిలీపట్నం ఓడరేవు నుండి 56 కిలోమీటర్ల బైపాస్ 4 వరుసల రహదారికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక అందజేయాలన్నారు. అక్టోబర్ 15 వ తేదీ నాటికి ఇసుకను తవ్వుకునేందుకు వీలుగా ఇసుకరీచులను సిద్ధం చేయాలన్నారు. రికార్డుల సర్వే, మీకోసం అర్జీల పరిష్కారం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం, విమానాశ్రయం డైరెక్టర్ ఎమ్ఎల్ కె రెడ్డి, మచిలీపట్నం ఓడరేవు ఈడి పల్లారావు, రైట్స్ కన్సల్టెన్సీ టీం లీడర్ వి ఎం శ్రీనివాస్, డి పి టి ఓ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ డిఎం పెద్దిరాజు, డీఐసీ జీఎం ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ జెడ్ యం బాబ్జి, పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్, సర్వే భూ రికార్డుల ఏడి జోషిలా, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పద్మావతి, మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్, డీఎఫ్ఓ సునీత, మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజ, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి, గృహ నిర్మాణ జిల్లా అధికారి పోతురాజు, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, సిపిడిసిఎల్ ఎస్ ఈ సత్యానందం, గనుల శాఖ ఏజీ కొండారెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

## 14న ఎస్ .హెచ్.ఓ.లో"చర్మవ్యాధుల ఉచిత వైద్య శిబిరం

**గుంటూరు టౌన్ సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ,మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినెల రెండవ ఆదివారం "స్పెషలిస్టులతో ఉచితవైద్య శిబిరాల "లో భాగంగా సెప్టెంబర్ నెల రెండో ఆదివారం 14వ తేదీ డెర్మటాలజీ- చర్మవ్యాధుల ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల అధ్యక్షులు డాక్టర్ టి .సేవకుమార్ ,పావులూరి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు 2/1 బ్రాడీపేట లోని ఎస్ .హెచ్. ఓ భవనంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ డి. అమర్ పాల్గొంటారన్నారు. ఈ శిబిరానికి ముందు మధుమేహ బాధితుల వచ్చే సాధారణ చర్మ వ్యాధులపైన, వివిధ రకాలపారాసైటిక్, బ్యాక్టీ రియల్, వైరల్ ,ఫంగస్ కారక చర్మవ్యాధులపై శాస్త్రీయ అవగాహన సభ ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా వారు ఆ ప్రకటనలో కోరారు.

# అవినీతి ఎస్ ఐ ని సస్పెండ్ చేయాలి

- సస్పెండ్ చేసేదాకా పోరాటం సాగిస్తాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి మాబు



**కనిగిరి సెప్టెంబర్ 12 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి నియోజకవర్గం సిఎస్ పురం మండలంలో అవినీతికి పాల్పడుతున్న ఎస్ ఐ వెంకటేశ్వర నాయక్ ను, కానిస్టేబుల్ చంద్ర నాయకుల దాడిని ఖండిస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పామూరు మండల కార్యదర్శి కె మాల్యాద్రి అధ్యక్షతన శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ సిఎస్ పురం ఎస్ఐ వెంకటేశ్వర నాయక్, కానిస్టేబుల్ చంద్రనాయక్ తోడుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వినాయక చవితి పండుగకు అనుమతులు ఉచితమని వాడవాడల పండగ జరుపుకోవాలని కూటమి ప్రభుత్వం చెబుతుంటే సిఎస్ పురం ఎస్ఐ వినాయక విగ్రహం ఏర్పాటుకు 2 వేలు, డీజే వాడుకుంటే 20 వేలు, పాట కచేరి ఏర్పాటు చేస్తే 40 వేలు ఇలా ప్రతిదానికి ఒక రేటు నిర్ణయించి అక్రమాలకు పాల్పడ్డారన్నారు. ఆటో కార్మికులపై దౌర్జన్యం చేయడం, కోర్టు వివాదంలో ఉన్న విషయాలలో కలగజేసుకుని పంచాయతీలు చేయడం, బూతులు తిడుతూ దాడికి పాల్పడడం, తమ అవినీతిని ప్రశ్నించిన వారిపై దాడి చేయడం షరామాములుగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఐ అవినీతిని ప్రశ్నించిన సిపిఎం పార్టీ నాయకులు ఊస వెంకటేశ్వర్లు, ఓ రైతుకు సంబంధించిన భూ వివాదంలో రైతుతో కలిసి పోలీస్ స్టేషన్ కు వెళ్లిన సమయంలో అసభ్య పదజాలంతో దూషించి దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సమస్యలు పరిష్కరించడానికి పోలీసులు ఉన్నారు కానీ సమస్యలు సృష్టించి ప్రజలపై దౌర్జన్యం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఇవాళ అవినీతిలో కూరుకుపోయి దందాలు చేస్తూ రౌడీలుగా వ్యవహరిస్తుంటే ఇక ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంది అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి పోలీసుల వలన నిజాయితీగా పనిచేసే పోలీసులందరికీ చెడ్డ పేరు తెస్తున్నారన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ భూ సమస్య, అవినీతి సమస్య ఎక్కడ ఉంటే పేద ప్రజలకు ఎక్కడ అన్యాయం జరుగుతుందో అక్కడ ప్రజల తరఫున రైతుల కోసం సిపిఎం పనిచేస్తుందన్నారు. సారాయి ఉద్యమాల్లో పోరాటం చేసిన ఘనత ఈ ప్రాంత వాసులదని అటువంటి ప్రాంత ప్రజలకు అన్యాయం జరిగితే కమ్యూనిస్టులు చూస్తూ ఊరుకునేది లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ రైతు తరపున మాట్లాడడానికి వెళ్ళిన ఊస వెంకటేశ్వర్లు పై ఎస్సై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం సుందరయ్య భవన్ సెంటర్ నుంచి సీఐ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి పామూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ అందుబాటులో లేని కారణంగా సీఐ కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు షేక్ షమీ, సి ఎస్ పురం సిపిఎం మండల కార్యదర్శి ఊస రాజ్యలక్ష్మి, ఎస్ తిరుపతి రెడ్డి, ఎం రత్నారెడ్డి, యాట వీరనారాయణ, షేక్ అల్లాబక్ష, షేక్ ఖాసీం సాహెబ్, గౌస్ బాషా, షేక్ మహబూబ్ పీరా, రామయ్య, నాయబ్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, నరసింహులు, జయ రావు పలువురు సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ రంగనాయక స్వామి దేవాలయం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం.



**మచిలీపట్నం సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం రాబర్ట్ సన్ పేటలో వేంచేసియున్న శ్రీ రంగనాయక స్వామి వారి దేవాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయ పాలక వర్గ సభ్యులుగా నల్లారి వెంకటేశ్వరరావు చైర్మన్, మందూరి రజిని, చిన్న ముత్తి కుమార్ , నేలుసు బాలరాజు, శ్రీ రామజ్యోతి, అన్నం స్వర్ణలక్ష్మి, నరసింహ శెట్టి వెంకట సాంబశివరావు ,కుంభ నాగమణి ,గాదె శ్రీనివాసరావు, గరికపూడి నాగబాబు ,ముత్తేవి శ్రీనివాసచార్యులు ఉప ప్రధాన అర్చక ఎక్స్ అఫీషియల్ మెంబర్ ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ కార్యనిర్వాహన అధికారి మాగాపాటి సత్య ప్రసాద్ బాబు ,ఇన్స్పెక్టర్ కగ్గ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం పుర ప్రముఖులు గొర్రె పార్టీ గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, బండి రామకృష్ణ , కొనకళ్ళ బుల్లయ్య, పల్లపాటి సుబ్రహ్మణ్యం, అన్నం ఆనంద్, లోగిశెట్టి స్వామి ,పివి ఫణికుమార్, అక్కుమంత రాజా ,సమతా కీర్తి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## మీకేం కాదు - భయపడకండి

**విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి**





**విజయవాడ పశ్చిమ సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి శుక్రవారం ఉదయం 57వ డివిజన్ కొత్త రాజరాజేశ్వరి పేటలో గల కేర్ అండ్ షేర్ పాఠశాలలో ఉన్న ప్రథమ వైద్య శిబిరంను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.అక్కడ చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. వారు భయాందోళన పడాల్సిన అవసరం లేదని, వారికి సరైన చికిత్స అందించి, వారిని ఆరోగ్యకరంగా ఉంచడమే లక్ష్యం అని, విజయవాడ నగర పాలక సంస్థ వారు, వారికి ఎటువంటి హాని కలగకుండా ప్రత్యేకమైన చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వారితో మాట్లాడుతుండగా కనీసం ప్రథమ ఆరోగ్య శిబిరానికి వచ్చే ఓపిక కూడా లేనివారు ఇంకొంతమంది ఇళ్లలోనే బాధపడుతున్నారని గమనించి, వారికి వాహనాలు ఏర్పాటు చేసి ప్రథమ ఆరోగ్య కేంద్రానికి వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆరోగ్య సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహిస్తూ ప్రతి కుటుంబంలో అనారోగ్యం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటన లో 57 డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, తదితర్లు పాల్గొన్నారు.

# స్థానిక లారీలకు ఉచితంగా బూడిద ఇవ్వాలి

***డ్రామాలతో పోరాటాన్ని పక్కదారి పట్టిస్తున్న టిడిపి నాయకులు***
***వైఎస్ఆర్ సిపి ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీను***



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12(వార్తా ప్రభ ప్రతినిధి)** కాలుష్య ప్రభావిత గ్రామాల లారీలకు ఉచితంగా బూడిద లోడింగ్ ఇవ్వాలని, బూడిద లోడింగ్ లో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు కొండపల్లి మున్సిపాలిటీ వైయస్సార్సీపి ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాస్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక లారీల కు ప్రాధాన్యం ఇవ్వాలని,బూడిద చెరువులో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లారీలకు బూడిద ఇవ్వడం పూర్తిగా నిషేధించాలన్నారు.ఎన్టీటీపీఎస్ యాజమాన్యం లారీ ఓనర్లతో తక్షణమే చర్చలు జరపలన్నారు. టెండర్ ద్వారా వచ్చే కోట్ల రూపాయల ఆదాయాన్ని కాలుష్య ప్రభావిత గ్రామాల అభివృద్ధికి మరియు ప్రజల ఆరోగ్యాల కోసం వాడాలి. ఆ విషయంపై చర్చించడానికి కాలుష్య ప్రభావిత గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు మరియు సామాజిక ఉద్యమకారులతో ప్రజాభిప్రాయ సేకరణ చేయాలన్నారు. టిడిపి నాయకుల పరిస్థితి విచిత్రంగా ఉందని దొంగే దొంగ దొంగ అని అరిచినట్టుగా, టిడిపి నాయకులు ఆరోపిస్తున్న బూడిద టెండర్ దక్కించుకున్న సూట్ కేసు కంపెనీ ఎవరిది? సూట్ కేసులు ఎవరికి వెళ్ళాయి? అనేది టిడిపి ప్రభుత్వంప కాబట్టి సూట్ కేసులు ఎవరికి వెళ్ళాయో ప్రజలకు చెప్పాలన్నారు. లారీ ఓనర్లకు డ్రైవర్లకు అన్యాయం జరిగితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలబడి వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతుందని గుంజ శీను తెలిపారు.

# ప్రభుత్వ టీచర్లకు వెంటనే డి ఎ చెల్లించాలి

**ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రభుత్వ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డి ఏ చెల్లించాలని కోరుతూఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాసిం మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఒక్క డీఏ కూడా ప్రకటించకపోవడం తీవ్ర విచారకరమని అన్నారు. డి ఎ లు పెండింగ్లో ఉన్నాయని,2003 రావలసిన పి.ఆర్.సి నేటి వరకు కమిషన్ ను నియమించకపోవడం, అదేవిధంగా గత పి ఆర్సి కు సంబంధించిన బకాయిలు, డి ఎ బకాయిలు,వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయులకు ఉద్యోగులకు 25 లక్షల రూపాయల ఆరోగ్య భీమా సదుపాయాన్ని కల్పించాలని, ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఏర్పాటు చేసిన అసెస్మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్యలు పరిష్కరించిన పక్షంలో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు వి నరేంద్ర,ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిలర్లు షేక్ మునీర్ భాష, పి వి దుర్గాప్రసాద్, పి వెంకటేశ్వరరావు, మండల సబ్ కమిటీ సభ్యులు అశోక్,సారధి, సుగుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## పన్యారంకు హెచ్ఆర్డి విద్య గోల్డ్ మెడల్ అవార్డు.




**మచిలీపట్నం సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నంకు చెందిన ప్రముఖ విద్యావేత్త ఆచార్య పన్యారామ్ సాంబశివరావుకు గత నెల 28వ తేదీన ఒక కార్యక్రమంలో న్యూఢిల్లీలోని హెచ్ఆర్డి సంస్థ 2025 బెస్ట్ ఎడ్యుకేషన్ అవార్డు, గోల్డ్ మెడల్ అవార్డును ప్రధానం చేశారు. ఈ అవార్డుతో ఆచార్య పన్యారామ్ మొత్తం 716 అవార్డులు పొందారు.బోధన పద్ధతిలో నూతన పద్ధతిని కనిపెట్టి సూత్ర పద్ధతి సృష్టికర్తగా ఖ్యాతిని గడించారు. సూత్ర పద్ధతిలో రాసిన 16 పేజీల పుస్తకంలో 2003 మార్చ్ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో టెన్త్ తెలుగు పేపర్ 1 కు సంబంధించిన 50 మార్కులకు గాను 49 మార్కులకు సంబంధించిన ప్రశ్నలు యధావిధిగా రావటం విశేషం. ప్రపంచంలోనే జనావాసం గల 6 ఖండాల నుండి 5 అగ్రరాజ్యాలతో సహా మొత్తం 30 దేశాల నుంచి అంతర్జాతీయ అవార్డులు, భారతదేశంలో నుండి అన్ని రాష్ట్రాలు, అన్ని కేంద్రపాలిత ప్రాంతాల నుండి జాతీయ అవార్డులు సాధించారు. 2023 ఫ్రాన్స్ విరాల్డ్ బెస్ట్ టీచర్ అవార్డు గోల్డ్ మెడల్ పొందారు. 1993- 2025 వరుసగా 33 ఏళ్లు ఉత్తమ ఉపాధ్యాయ ఉత్తమ విద్య సాహితీవేత్తగా అవార్డును పొందారు.న్యూఢిల్లీ హెచ్ఆర్డి జాతీయ విద్య అవార్డు గోల్డ్ మెడల్ పొందిన ఆశ్చర్య పన్యరామును పలువురు విద్యా, సాహిత్య వేతలు అభినందించారు.

# బాలుడు మిస్సింగ్ కేసు సుఖాంతం

**నాలుగు రోజుల క్రితం దివ్యాంగుల పాఠశాల నుండి మాయమైన దైదా సన్నీ**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12(వార్తా ప్రభ ప్రతినిధి):** నాలుగు రోజుల క్రితం ఇబ్రహీంపట్నం అన్నమ్మ దివ్యాంగ సేవా సంస్థ పాఠశాల నుండి కనిపించకుండా పోయిన దైదా సన్నీ ఆచూకీ లభించింది. శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో భవానీపురం సమీపంలో సంచరిస్తున్న బాలుడిని గుర్తించిన ఇబ్రహీంపట్నం వాసులు సుభాష్ అతని ఫ్రెండ్స్ పోలీస్ స్టేషన్ కు తీసుకొచ్చారు. పోలీసులు బాలుడి తల్లిదండ్రులకు అప్పచెప్పారు. పలు అనుమానాలు,రోపణల మధ్య సంచలనంగా మారిన మిస్సింగ్ కేసు సుఖాంతం అవ్వడంతో అందరూ ఉపయోగించుకున్నారు.

# పాఠశాలకు దాతల సాయం



**ఇబ్రహీంపట్నం,సెప్టెంబర్ 12 (వార్తా ప్రభ ప్రతినిధి):**మండలం కొటికలపూడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వసతుల కల్పనలో ఆ భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.వి మాలిని విజ్ఞప్తి తో మరుపు కంప్యూటర్ టేబుల్,మూడు ప్రింటర్లు, స్పీకర్, మెయిన్ గేటును ను దాతలు పత్రి లేపాక్షి,వి.స్.స్ సావిత్రి,బాలకృష్ణ, కె బి.జ్యోతికమ్మ, వి.కోటేశ్వరరావు ఎస్.బి.కిరణ్ , శ్యామ్ సుందర్ పాఠశాలలకు స్వయంగా అందజేశారు. స్కూలు అభివృద్ధికి తమ వంతు సాయం అందించిన దాతలకు స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

# బూడిద టెండర్ ఆదాయం కాలుష్య బాధిత గ్రామాలకు వెచ్చించాలి

***జిల్లా జడ్పీ సమావేశంలో జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి***

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12 (వార్తా ప్రభ ప్రతినిధి):** డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ బూడిద రవాణా కాంట్రాక్టు నుంచి వచ్చే ఆదాయాన్ని కాలుష్య బాధిత గ్రామాలకు వెచ్చించాలని అధికారులను కోరారు ఇబ్రహీంపట్నం జడ్పిటిసి మరియు జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి రాంబాబు. గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. సుమారుగా 35 కోట్లు బకాయిలు రావాల్సి ఉన్న ఎవరూ పట్టించుకోవడంలేదని అన్నారు. ఇటీవల ఆర్భాటంగా నాలుగు కోట్లు ఇచ్చామని చెప్పారు అవి ఎక్కడ ఎవరికీ ఖర్చు చేశారో కూడా తెలియదని ఆమె అధికారులను ప్రశ్నించారు. బూడిద కాంట్రాక్ట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని కాలుష్య ప్రేరేపిత గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ఉపయోగించాలని కోరారు. అదేవిధంగా స్థానిక చిన్నాచితక లారీ ఓనర్లు డ్రైవర్లు లకు బూడిద రవాణాల ప్రాధాన్యం కల్పించాలని కోరారు.రైతులకు యురియా సరఫరా పై ఎన్నో ఆరోపణలు వస్తున్న అధికారులు స్పందించడం లేదని, రైతులందరికీ సరైన పద్ధతిలో యూరియా పంపిణీ జరగాలని కోరారు. ఇబ్రహీంపట్నంలో ఇప్పటికీ యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను వెంటనే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్



ను కోరారు. జాయింట్ కలెక్టర్ నివేదిక తెప్పించి విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# డిప్యూటీ డైరెక్టర్ హెూదాలో అకాడమీ పదవి బాధ్యతలు చేపట్టిన ఎం. భాస్కర నారాయణ



**విజయవాడ, సెప్టెంబర్ 12 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర సమాచార కేంద్రంలో సహాయ సంచాలకులుగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పై సి ఆర్ మీడియా అకాడమీ లో శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టడం జరిగినది. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పదవి బాధ్యతలు స్వీకరించిన ఎం భాస్కర్ నారాయణ ను సి ఆర్ మీడియా సెక్రెటరీ వి. మణిరాం, అకౌంట్ ఆఫీసర్ శాంతారాం, లైబ్రేరియన్ వి. శేఖర్, జూనియర్ అసిస్టెంట్ ఎం. లోవ రాజు, ఆదిత్య అభినందించారు.

# కేంద్ర, రాష్ట్ర నిధులను సమర్థవంతంగా ఉపయోగించుకుని జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

-ఏలూరు జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధి, సమన్వయ కమిటీ (దిశ) సమావేశం లో పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్



**ఏలూరు, సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** ఏలూరు జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధి, సమన్వయ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, కైకలూరు ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కలెక్టర్ వెట్రిసెల్వి, ఇతర అధికారులు పాల్గొన్నారు. కేంద్ర నిధులతో జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టుల పురోగతిని ప్రజాప్రతినిధులకు అధికారులు వివరించారు. జంగారెడ్డిగూడెం – ఏలూరు రోడ్డు అధ్వాన్నంగా ఉందని, అధికారులు వెంటనే రిపేరు పనులు చేపట్టాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. ఈ మార్గంలో కొత్త జాతీయ రహదారి ఏర్పాటుకు కేంద్రంతో మాట్లాడుతున్నట్లు ఎంపీ తెలిపారు. దెందులూరు రహదారి పనులు కూడా వెంటనే చేపట్టాలని అధికారులను ఎంపీ కోరారు. అనేక చోట్ల గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్లు, ఇతర పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు పనులు చేయడంలో జాప్యం చేస్తున్నా, అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం అనంతరం విలేఖరులతో మాట్లాడిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ .. ఎంపీ లాడ్స్ సహా, కేంద్ర నిధులను, పథకాలను సమర్థవంతంగా ఉపయోగించుకుని ఏలూరు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రం ఇటీవల మంజూరు చేసిన ఆర్వోబీల పనులు త్వరగా మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించామని, రైల్వే శాఖ తరపున ఉమ్మడి సర్వే జరగాల్సిఉందని, అది పూర్తయితే త్వరలోనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెడతామని అధికారులు చెప్పారన్నారు. వట్లూరు సమీపంలో రైల్వే ట్రాక్ వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేస్తే సమీపంలోని విద్యాసంస్థలకు వెళ్ళే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే చింతమనేని తమ దృష్టికి తీసుకువచ్చారనీ, దీనిపై నివేదిక తయారు చేయాల్సిందిగా రైల్వే అధికారులను ఆదేశించామని ఎంపీ చెప్పారు. అలాగే ఏలూరు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని నవంబర్ లో ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రైల్వే అధికారులు వెల్లడించారన్నారు. కొవ్వూరు – భద్రాచలం రైల్వే లైన్ కోసం తయారు చేస్తున్న డీపీఆర్ లో కొన్నిచోట్ల అలైన్మెంట్ మార్పులతోపాటు, జంగారెడ్డి గూడెం వద్ద స్టేషన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైల్వే అధికారులను ఆదేశించారు. టెలికాం సిగ్నల్ సమస్యల పరిష్కారానికి ఏలూరు పార్లమెంట్ పరిధిలో 175 బిఎస్ఎన్ఎల్ టవర్ల ఏర్పాటు చేయటానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడించారు. ఏలూరు జిల్లాలో ఇప్పటికే 400 కోట్ల పెట్టుబడులు వచ్చాయని, మరికొన్ని పరిశ్రమలకు కృషి చేస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. సమావేశంలో జెడ్పీ సీఈవో, ఇరిగేషన్, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శిల్పకారుల ప్రతిభకు పురస్కారం లేపాక్షి హస్తకళల డిజైన్ అవార్డులు

- ఆవిష్కరణ - సంప్రదాయాల కలయికతో లేపాక్షి ఆవిష్కరణలు
- ఆంధ్రప్రదేశ్ శిల్పకారులకు అరుదైన గౌరవం లేపాక్షి అవార్డులు 2025



**విజయవాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** హస్త కళ కారుల జీవన ప్రమాణ స్థాయి పెరిగినప్పుడే ఆ కళలు భవిష్యత్తు తరాలకు అందుబాటులోకి వస్తాయని లేపాక్షి చైర్మన్ పసుపులేటి హరి ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ డిజైన్ పోటీ 2025 అవార్డుల కార్యక్రమం శుక్రవారం సాయంత్రం విజయవాడ అమ్మ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. శిల్పకళల్లో వినూత్నత ప్రదర్శించిన కళాకారులను ఈ సందర్భంగా సత్కరించారు. రానున్న కాలంలో ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన ప్రతి ఒక్క ఉత్పత్తికి జీ ఐ సాధించేలా కృషి ఈ సందర్భంగా హరి ప్రసాద్ అన్నారు. కార్యక్రమానికి చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా అధ్యక్షత వహించగా అవార్డులు శిల్పకారుల ప్రతిభను మాత్రమే కాదు, రాష్ట్ర సంప్రదాయ కళలకు ప్రోత్సాహాన్ని కూడా ప్రతిబింబిస్తాయన్నారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**అవార్డులు సాధించిన కళాకారులు..** ఈ అవార్డులు శిల్పకారుల ప్రతిభను మాత్రమే కాదు, రాష్ట్ర సంప్రదాయ కళలకు ప్రోత్సాహాన్ని కూడా ప్రతిబింబించాయి.కొండపల్లి, ఏటికొప్పాక, వుడ్ కార్వింగ్, తోలుబొమ్మలు, కలంకారీ బ్లాక్ ప్రింటింగ్ విభాగాల్లో పోటీ నిర్వహించి నిపుణులతో కూడిన జ్యూరీ ద్వారా నూతన ఆవిష్కరణలను ఎంపిక చేశారు . మొత్తం 15 అవార్డులను గాను గోల్డ్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు కలిపి రూ.3 లక్షలు పంపిణీ చేశారు. నూతక్కి శ్రీనివాసరావు (కొండపల్లి బొమ్మలు %-% శ్రీనివాస కల్యాణం), బొంగేటి అయ్యన్న (ఏటికొప్పాక బొమ్మలు %-% మల్టీపర్పస్ యుటిలిటీ బాక్స్), దలవాయి అనంతమ్మ (తోలుబొమ్మలు %-% టేబుల్ ల్యాంప్ షేడ్), సుబ్రహ్మణ్య ఆచార్య (వుడ్ కార్వింగ్ %-% షోకేస్ ఐటమ్), కె.వి.ఎస్.ఎస్. కిషోర్ (కలంకారీ బ్లాక్ ప్రింటింగ్ %-% వాల్ పెయింటింగ్ క్లాత్) లు బంగారు పతకాలు గెలుచుకున్నారు. అదనంగా ఐదుగురు శిల్పకారులు ప్రత్యేక అవార్డులు అందుకున్నారు. వీరితో ఒక్కొక్కరికి రూ.10,000, సర్టిఫికెట్లు బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా గాంధీ శిల్ప్ బజార్, మాస్టర్‌పీసెస్ ప్రదర్శన %-% అమ్మకాలు ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 14 వరకు ఈ ప్రదర్శన కొనసాగనుంది.

# కొమ్మారెడ్డి స్కూల్ లో ముందస్తుగా ఘనంగా హిందీ భాషాదినోత్సవం



**కృత్తివెన్ను, సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు జరగవలసిన జాతీయ హిందీ భాషాదినోత్సవాన్ని సెలవుల కారణంగా ఈ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 5 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు గల విద్యార్థిని, విద్యార్థులు హిందీ కవులు, కవయిత్రుల వేషధారణలు ధరించి అందరిని అలరించారు. ఈ సందర్భంగా 5 వ తరగతి నుండి 10 వ తరగతి వరకు గల విద్యార్థిని, విద్యార్థులకు హిందీ స్పెల్ బీ, బాల గీతాలు, హిందీ సూక్తులు, సామెతలు, హిందీ జాతీయాలు, హిందీ ప్రతిభా పరీక్షలు నిర్వహించి విజేతలైన 100 మంది విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. హిందీ కవులు, కవయిత్రుల వేషధారణలు ధరించిన విద్యార్థిని, విద్యార్థులకు కూడా బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ మాట్లాడుతూ హిందీ మన జాతీయ మరియు రాజభాష అని నేడు ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి జీవనోపాధిగా మారిందని, ప్రతి విద్యార్థి హిందీ శ్రద్ధగా నేర్చుకుని హిందీలో ప్రావీణ్యతను సాధించి దేశ విదేశాలలో ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరుతూ హిందీ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, స్కూల్ సెక్రెటరీ మరియు కరస్పాండెంట్ కె. యస్. వి. జి. శోభ, యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హారిణి , స్కూల్ హెడ్మాస్టర్ . ఎన్.శ్రీనివాసరావు , హిందీ ఉపాధ్యాయులు యస్. చంద్రశేఖర్ వి. విదుకొండలు కె. మాలతీ యస్. మాలతీ కుమారి మైమున్నీసా విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుడివాడ -ఆటోనగర్ కు పూర్వ వైభవం తీసుకొస్తా : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

-ఆటోనగర్ లో పర్యటించి.. నుగలాపు ట్రస్ట్ సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాము.. ఆటోనగర్ సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావిస్తా..





**గుడివాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన గుడివాడ ఆటోనగర్ కు పూర్వ వైభవం తీసుకొస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆటోనగర్ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే రాము చెప్పారు. స్థానిక ఆటోనగర్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము శనివారం పర్యటించారు. స్థానికంగా శ్రీ శ్రీనివాస ఆటో ఇంజనీరింగ్ వర్క్స్ ప్రాంగణంలో నుగలాపు జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో ద్వారకా తిరుమల చిన్న తిరుపతి దేవస్థానానికి అందిస్తున్న 4వేల లీటర్ల వాటర్ ట్యాంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే రాము.. దేవస్థాన ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ... గత అనేక దశాబ్దాలుగా నూగలాపు జయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు మరియు కుటుంబ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఈ సందర్భంగా ఆటోనగర్ దుస్థితి గురించి ఎమ్మెల్యే రాము ప్రస్తావించారు. రాష్ట్రంలో ప్రాముఖ్యత కలిగిన గుడివాడ -ఆటోనగర్ గత పాలకుల నిర్లక్ష్య ఫలితంగా సమస్యల వలయంలో మునిగిపోయి అభివృద్ధికి దూరంగా ఉండడం బాధాకరమన్నారు. ప్రస్తుత ఆటోనగర్ దుస్థితి చూస్తుంటే బాధ కలుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఇంజనీరింగ్ ఉత్పత్తుల ఆవిష్కరణకు నిలయమైన గుడివాడ ఆటోనగర్ కు పూర్వ వైభవం తీసుకొస్తానని రానున్న రోజుల్లో మరిన్ని ఆవిష్కరణలు జరిగేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి ఆటోనగర్ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు,నుగలాపు ట్రస్ట్ కన్వీనర్ నుగలాపు సురేష్, టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ్, చేకూరు జగన్ మోహన్ రావు, నిమ్మగడ్డ సత్యసాయి, జోగా బాలకృష్ణ, వసంతవాడ దుర్గారావు, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ప్రతినిధులు, ఆటోనగర్ పెద్దలు, ద్వారకాతిరుమల దేవస్థాన ప్రతినిధులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడుగా కుడుపూడి



**అమలాపురం,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** గొల్లగూడెం కె జి కె మెమోరియల్ జిమ్ లో కుడుపూడి గోపాలకృష్ణ గోకలే(ఐపిఎస్) మెమోరియల్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అమలాపురం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా కుడుపూడి సూర్యనారాయణరావు , అధ్యక్షులుగా ముంగర ప్రసాద్, ఉప అధ్యక్షులుగా ఎస్ ఎం కె రెడ్డి,కార్యదర్శిగా చీకురుమెల్లి కిరణ్ కుమార్, ఉప కార్యదర్శిగా వాడ్రేవు భారత్ కుమార్, కోశాధికారిగా పితాని మానేశ్వరావు ,మెంబర్లగా జి ఎస్ఎన్ మూర్తి,సంసాని వెంకట రత్నకుమార్,విత్తనాల శివ ప్రసాద్ ,మట్టపర్తి రామకృష్ణ ,గుబ్బల ఉదయ్ భాస్కర్ ,వాసంశెట్టి చినబాబు.చప్పిడి శోభన్ బాబు నియమితుల అయ్యారు. సందర్భముగా సూర్యనారాయణరావు మాటాడుతూ మన జిమ్ నుంచి.అనేకమంది స్టేట్ యూనివర్సిటీ నేషనల్ బాడీ బిల్డర్లు పవర్ లిఫ్టర్లు వెయిట్ లిఫ్టర్లు పోటీలలో పాల్గొని గెలుపొంది అమలాపురానికి పేరుప్రఖ్యాతలు తీసుకొచ్చారని అన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే రాము

- రాజేంద్రనగర్ లోని స్వగృహంలో ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..



**గుడివాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** గుడివాడ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధతో కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. రాజేంద్రనగర్ లోని ఆయన స్వగృహంలో గుడివాడ పట్టణం మరియు నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన ప్రజల నుండి ఎమ్మెల్యే రాము సమస్యల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల వినతులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎమ్మెల్యే రాము.. ప్రజలు చెప్పిన సమస్యలను సావధానంగా వింటూ సంబంధిత శాఖల అధికారులకు ఫోన్లు చేసి పలు సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా తనను కలిసిన వారికి ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. అర్జీదారుల సమస్యలను సంబంధిత శాఖ అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పలువురు కూటమి నాయకులు, పలు గ్రామాల పెద్దలు ప్రజా సమస్యలను ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకురాగా జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు చేకూరు జగన్ మోహన్ రావు తదితరులు వినతుల స్వీకరణలో ఎమ్మెల్యే రాము వెంట ఉన్నారు.

# ఏఎన్నార్ కళాశాలలో డైనమిక్ బిజినెస్ మానిటరింగ్ పై ధోరణి కార్యక్రమం



**గుడివాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఎం.బి.ఎ. డిపార్టుమెంటు ఆధ్వర్యంలో డైనమిక్ బిజినెస్ మానిటరింగ్ పై ఓరియంటేషన్ ప్రోగ్రామ్.. ఎక్సెల్ మరియు పవర్ బి.ఐ.తో రియల్ టైమ్ డాష్ బోర్డులు మీద ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథి ఉపన్యాసకులుగా పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల డాక్టర్ పి. గురుప్రసాద్ పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ ప్రస్తుత కాలములో వ్యాపార విశ్లేషణలు, పవర్ బి.ఐ., ప్రతి ఒక్క మానేజెమెంట్ విద్యార్థి నేర్చుకోవాలని తెలియజేశారు. అలాగే అయన ప్రసంగిస్తూ ఉదాహరణలుగా డి & మార్ట్, రిలయన్స్, అమెజాన్, ఫ్లిప్ కార్డుల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, కళాశాల ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె. ప్రసాద్, కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.ఎస్. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్. పద్మజ, ఎం.బి.ఎ. డిపార్టుమెంటు విభాగాధిపతి డాక్టర్ ఎం.బి.సువర్చల, ఎం.బి.ఎ. అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



నూతన ఉప రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ సానా సతీష్ బాబు.

–కాకినాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :

# రాజీయే రాజమార్గం..

- నేడు జాతీయ లోక్ అదాలత్.. జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : మండల న్యాయసేవాధికార కమిటీ అధ్యక్షులు, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. సుబ్రహ్మణ్యం




**గుడివాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మరియు జిల్లా న్యాయసేవాధికార సంస్థ వారి ఆదేశ్యానుసారము ది. 13.09.2025 న గుడివాడ మండల్ న్యాయసేవాధికార కమిటీ వారి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించబడును. ఈ లోక్ అదాలత్ నందు కోర్టులలో పెండింగ్ లో ఉన్న మోటార్ వెహికల్ కేసులు, రెవిన్యూ మరియు అనుబంధ కేసులు పరిష్కరించబడును. కావున కక్షిదారులు అధిక సంఖ్యా పాల్గొని ది. 13.09.2025 ఉదయం 10.30 ఏ.యమ్. నిమిషాల నుండి జరుగు "లోక్ అదాలత్" నందు తమ కేసులను పరిష్కరించుకోవలసిందిగా మండల న్యాయసేవాధికార కమిటీ అధ్యక్షులు, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ జి. సుబ్రహ్మణ్యం గారు కోరడమైనది. ఈ లోక్ అదాలత్ నందు న్యాయవాదులు, ఇన్సూరెన్సు అధికారులు, రెవిన్యూ అధికారులు, అందరు పాల్గొని ఎక్కువ కేసులు పరిష్కరించుటకు సహకరించవలసిందిగా కోరడమైనది.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం పై విద్యార్థులకు అవగాహన..



**గుడివాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** జెసిఐ అల్యూమిని క్లబ్ ఆధ్వర్యంలో జోన్ లెవెల్ ప్రాజెక్టుగా చేపట్టిన అన్నం పరబ్రహ్మ స్వరూపం కార్యక్రమంలో భాగంగా గుడివాడ మండలం సిద్ధాంతం గ్రామం మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల నందు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జోన్ డైరెక్టర్ ఉరిటి రామారావు భారతదేశంలో జరుగుతున్న ఆహార వృధావల్ల జరుగుతున్న పరిణామాలను విద్యార్థులకు వివరించారు. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు యమ్‌యస్‌వి సత్యనారాయణ బాబు విద్యార్థులతో ప్రతిజ్ఞను నిర్వహించడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం పై స్పందించి మాట్లాడటం జరిగింది. కార్యక్రమం చేపట్టిన జేసి అల్యూమిని క్లబ్ ని అభినందించడం అలాగే, సమాజంలో లో ఆహార వృధాపై తీసుకోవాల్సిన చర్యలను కూడా విద్యార్థులతో చెప్పడం జరిగింది. ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు సత్యనారాయణ బాబు, ఇతర ఉపాధ్యాయులు నరేంద్రబాబు, అబ్దుల్ హకీం, జాహ్నవి, మణి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు మాంటిస్సోరి ఇం.మీ. హై స్కూల్ విద్యార్థి




**గుడివాడ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ వారు 2025 మే 15 నుండి 18 వరకు చిత్తూరు పి.ఇ.ఎస్. పబ్లిక్ స్కూల్ నందు నిర్వహించిన 10వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ చాంపియన్‌షిప్ బాస్కెట్‌బాల్ పోటీల్లో గుడివాడ మాంటిస్సోరి ఇం.మీ. హై స్కూల్‌కు చెందిన విద్యార్థి గూడవల్లి రాకేష్ వీర మాధవ్ విశేష ప్రతిభనుఏ కనబరచి అక్టోబరు 4 నుండి 10 వరకు డెహ్రాడూన్ నందు జరిగే 50వ సబ్ జూనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు అంధ్రప్రదేశ్ టీంకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థి రాకేష్ వీర మాధవ్‌ను మాంటిస్సోరి మహిళా సంఘ కార్యవర్గ సభ్యులు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి. పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయులు జి.శ్రీనివాస్, ఎమ్. సత్య అన్వేష్ లు ఎంపికైన విద్యార్థికి తమ అభినందనలు తెలియజేసారు.

# సంపూర్ణ పేదరిక నిర్మూలన కూటమి ప్రభుత్వ ధ్యేయం..

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- అవనిగడ్డలో ఘనంగా సూపర్ సిక్స్ సూపర్ హిట్ స్త్రీ శక్తి విజయోత్సవ సభ.





**అవనిగడ్డ,సెప్టెంబరు 12 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో సంపూర్ణ పేదరిక నిర్మూలన సాధించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం అవనిగడ్డ రెవిన్యూ హాలులో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ సూపర్ హిట్ స్త్రీ శక్తి విజయోత్సవ సభ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా శక్తివంతులను చేయటమే ధ్యేయంగా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి, తల్లికి వందనం, దీపం-2 పథకాలు మహిళలకు వరాలుగా నిలుస్తున్నాయన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం-2 పథకాల ద్వారా నియోజకవర్గ మహిళలకు రూ.42 కోట్లు లబ్ది కలిగిందన్నారు. నియోజకవర్గంలో తల్లికి వందనం పథకం ద్వారా 23,468 మంది తల్లులకు రూ.35,20,20,000లు లబ్ది, దీపం-2 పథకం ద్వారా 58,944 మంది లబ్దిదారులకు రూ.4,97,99,037 లబ్ది చేకూరిందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణించిన 5,03,763 మంది మహిళలకు రూ.కోటీ 80 లక్షల 43వేల 758 లబ్ది కలిగినట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలను మహాశక్తిగా మార్చేందుకు, ప్రతి ఇంటా ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేసేందుకు ఎన్నికల ముందు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఇచ్చిన ప్రతి హామీని అమలులోకి తెచ్చారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి సూపర్ హిట్ ప్రభుత్వంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆదరాభిమానాలు చూరగొంటోందన్నారు. పీ-4 ప్రోగ్రామ్ ద్వారా పేదరిక నిర్మూలనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు గ్రామీణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గంలోని గ్రామాల్లో రూ.30 కోట్లతో నూతన సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. వైసీపీ తరహాలో కూటమి ప్రభుత్వంలో రాజకీయ వివక్షకు తావు లేదన్నారు. సీఎంఆర్ఎఫ్ సహాయం పార్టీలకు అతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకూ 15 విడతల్లో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్యానికి రూ.4,27,74,065లు అందించినట్లు తెలిపారు. రాష్ట్ర ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం సమర్థవంతంగా అమలు చేస్తున్న సందర్భంగా తాను ఆర్టీసీ చైర్మనుగా ఉండటం తన అదృష్టం అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పని చేస్తున్న కూటమి ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు పీ-4 కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. టీడీపీ అంగన్వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి వివరించారు. నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసి సూపర్ హిట్ ప్రభుత్వం అని పేరు పొందినట్లు తెలిపారు. నేపాల్ అల్లర్ల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న తెలుగువారిని నారా లోకేష్ సురక్షితంగా స్వరాష్ట్రానికి రప్పించి స్వస్థలాలకు చేర్చారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగు మహిళలు, వీర మహిళలు, కూటమి నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

